thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 142 | జగిత్యాల | మంగళవారం 25 ఆగస్టు, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

భారత్ అఫ్గాన్ షెడ్యూల్ విడుదల



11



# 19 ఏళ్లకే అందాల కిరీటం

## 'మిస్ యూనివర్స్ ఇండియా-2026'గా కాజియా లిజ్ మెజో

- 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి కేరళ యువతి ఘనత
- లా చదువుతూనే మోడలింగ్‌లో సత్తా.. కళల్లోనూ బహుముఖ ప్రజ్ఞ
- నవంబర్‌లో ప్రపంచ వేదికపై భారత్‌కు ప్రాతినిధ్యం

కేరళకు చెందిన 19 ఏళ్ల లా విద్యార్థిని, మోడల్ కాజియా లిజ్ మెజో అందాల ప్రపంచంలో మరో అరుదైన ఘనత సాధించారు. జైపూర్‌లో అట్టహాసంగా జరిగిన 'మిస్ యూనివర్స్ ఇండియా-2026' గ్రాండ్ ఫినాలేలో 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి విజేతగా నిలిచారు.

4లో..

# రైతు ఉద్యమ పెద్దదిక్కు ఇకలేరు



- ప్రముఖ రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి కన్నుమూత
- 88 ఏళ్ల వయసులో అనారోగ్యంతో తుదిశ్వాస
- రైతు సమస్యలపై దశాబ్దాల పాటు అలుపెరుగని పోరాటం
- అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా కీలక సేవలు
- కమ్యూనిస్టు, రైతు సంఘాల్లో విషాదఛాయలు

2

## రైతాంగ పోరాట యోధుడికి నేతల నివాళి

- సారంపల్లి మల్లారెడ్డి మృతిపై సీఎం రేవంత్ తీవ్ర దిగ్భ్రాంతి
- కమ్యూనిస్టు, రైతాంగ ఉద్యమాలకు తీరని లోటు: కూనంనేని
- ఆయన పోరాటం తరాలకు స్ఫూర్తిదాయకం: హరీశ్‌రావు

2

# తెలంగాణపై కేంద్రం వివక్ష!

- ఇంగ్లాండ్‌కు అనుమతించి.. అమెరికాకు నిరాకరణ?
- గుజరాత్ సీఎంకు అనుమతి.. తెలంగాణ సీఎంకు అడ్డంకులా?
- ఇది నాకు జరిగిన అవమానం కాదు..
- నాలుగు కోట్ల ప్రజలకు జరిగిన అన్యాయం
- తెలంగాణ అభివృద్ధిని మాత్రం ఎవరూ అడ్డుకోలేరు
- కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం



2లో

## అందుకే అమెరికా పర్యటన అడ్డగింత

"నా అమెరికా పర్యటనను అడ్డుకోవడం నన్ను వ్యక్తిగతంగా అవమానించడం కాదు.. తెలంగాణ ప్రజలను అవమానించడమే. నా పర్యటనను ఆపగలరు.. కానీ తెలంగాణ అభివృద్ధిని, మా లక్ష్యాలను అడ్డుకోలేరు" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పెట్టుబడుల సాధన కోసం చేపట్టాలనుకున్న అధికారిక అమెరికా పర్యటనకు రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించడం తెలంగాణపై కేంద్రం చూపుతున్న వివక్షకు నిదర్శనమని ఆరోపించారు. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. వికసిత్ భారత్-2047లో భాగంగానే తమ ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యాన్ని ప్రకటించిందన్నారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా రాష్ట్రాన్ని ఆర్థిక పురోభివృద్ధి దిశగా తీసుకెళ్లాలనే ఉద్దేశంతోనే విదేశీ పర్యటనలకు వెళ్తున్నామని వివరించారు.

*- హైదరాబాద్ (చురకలు), ఆగస్టు 24*



# 22ఏపై అపోహలొద్దు

- లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో చేర్చామనడం పచ్చి అబద్ధం
- వచ్చిన దరఖాస్తుల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి
- నిజమైన సమస్యలకు 24 నుంచి 36 గంటల్లో పరిష్కారం
- పట్టణ భూ గరిష్ఠ పరిమితి భూములపై త్వరలో విధాన నిర్ణయం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి

2



4

# అమెరికా యుద్ధాన్ని కొనసాగిస్తే అంతే సంగతులు

ఒక్కచుక్క చమురు సరఫరా కానివ్వం
ఇరాన్ మరోమారు ఘాటు హెచ్చరికలు



# సింఘేశ్వర ఆలయం వద్ద తోపులాట

- ఆరుగురు భక్తులకు గాయాలు
- శ్రావణ సోమవారం కావడంతో ఆలయానికి పోటెత్తిన జనం
- అకస్మాత్తుగా కూలిన బారికేడ్.. భయాందోళనలో భక్తులు

4

# కాంగ్రెస్ అధిష్టానం పరిశీలనలో కొండా సుష్మిత వ్యవహారం

- కాంగ్రెస్ పెద్దలు తీసుకునే నిర్ణయం కోసం వేచిచూస్తున్నాం
- సోషల్ మీడియాతో బతికేస్తున్న కేటీఆర్
- టీపీసీసీ చీఫ్ మహేశ్

3

కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. పెద్దలు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు.



# నకిలీ డీఎస్పీగా అవతారం

## రూ.1.20 కోట్ల మోసం

వలపన్ని పట్టుకుని అరెస్ట్ చేసిన హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు



3



# కల్యాణలక్ష్మి కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

- దివ్యాంగ వధువులకు సాయాం కొనసాగించాలని హైకోర్టు ఆదేశం

3



# ఇంజనీరింగ్ విద్యార్థికి 'ఉగ్ర' లింకులు?

రామగుండంలో ఎన్ఐఏ తనిఖీల కలకలం
ముజామిల్ ఖాన్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు
ఎన్‌టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ముమ్మరంగా ప్రశ్నలు

4

# తెలంగాణపై కేంద్రం వివక్ష!

**అందుకే అమెరికా పర్యటన అడ్డగింత**

**ఇంగ్లాండ్‌కు అనుమతించి.. అమెరికాకు నిరాకరణ?**

**గుజరాత్ సీఎంకు అనుమతి.. తెలంగాణకు అడ్డంకులా?**

**ఇది నాకు జరిగిన అవమానం కాదు..**

**నాలుగు కోట్ల ప్రజలకు జరిగిన అన్యాయం**

**తెలంగాణ అభివృద్ధిని మాత్రం ఎవరూ అడ్డుకోలేరు**

**కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం**



**హైదరాబాద్, ఆగస్టు 24 (చురకలు) :** పెట్టుబడుల సాధనే లక్ష్యంగా చేపట్టాలనుకున్న తన అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడం తెలంగాణపై రాజకీయ వివక్షేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. ఇంగ్లాండ్ పర్యటనకు అనుమతించిన కేంద్రం.. అమెరికా పర్యటనకు మాత్రం రాజకీయ కారణాలు చూపుతూ అనుమతి నిరాకరించిందని ఆరోపించారు. ఆ రాజకీయ కారణాలేమిటో ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. విదేశీ పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ముందుగానే అందించినట్లు చెప్పారు. తెలంగాణ అభివృద్ధి, పెట్టుబడులు, విద్య, క్రీడల రంగాల్లో అంతర్జాతీయ భాగస్వామ్యాలను పెంపొందించడమే పర్యటన ప్రధాన ఉద్దేశమన్నారు. అయినప్పటికీ అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వకపోవడం వెనుక రాజకీయ కారణాలున్నాయని ఆరోపించారు.

**గుజరాత్‌కు ఓ న్యాయం.. తెలంగాణకు మరో న్యాయమా?**

ఆగస్టు 17 నుంచి 28 వరకు అమెరికా, కెనడాలో పర్యటించేందుకు గుజరాత్ ముఖ్యమంత్రికి కేంద్రం అనుమతి ఇచ్చిందని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. అదే సమయంలో 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యాల్లో భాగంగా రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు తాను చేపట్టాలనుకున్న అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించడం వివక్ష కాక మరేమిటని ప్రశ్నించారు. ఇది వ్యక్తిగతంగా తనకు జరిగిన అవమానంగా చూడటం లేదని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయంగా భావిస్తున్నానని సీఎం అన్నారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారిక పర్యటనకు రాజకీయ కారణాలతో అడ్డంకులు సృష్టించడం రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. ఇటువంటి వైఖరి సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. "నా పర్యటనను అడ్డుకోవచ్చు.. కానీ తెలంగాణ అభివృద్ధి లక్ష్యాన్ని చేరుకోకుండా ఎవరూ అడ్డుకోలేరు" అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కేంద్రం అనుమతి నిరాకరించిన అంశాన్ని తెలంగాణ ఎంపీలు పార్లమెంటులో ప్రస్తావిస్తారని తెలిపారు.

**డిసెంబర్‌లో ప్రపంచ పెట్టుబడుల సదస్సు**

డిసెంబర్ 8, 9 తేదీల్లో 'ఇన్వెస్ట్ తెలంగాణ' ఆధ్వర్యంలో 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' నిర్వహించనున్నట్లు సీఎం వెల్లడించారు. దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను రాష్ట్రానికి ఆకర్షించడమే లక్ష్యంగా సదస్సును నిర్వహిస్తామన్నారు. విద్య, క్రీడలు సహా వివిధ రంగాల్లో అంతర్జాతీయ భాగస్వామ్యాలను పెంచడంతో పాటు భారీ పెట్టుబడులను ఆకర్షించి తెలంగాణను ప్రపంచస్థాయి గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.




# 19 ఏళ్లకే అందాల కిరీటం

**'మిస్ యూనివర్స్ ఇండియా-2026'గా కాజియా లిజ్ మెజో**

**52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి కేరళ యువతి ఘనత**

**లా చదువుతూనే మోడలింగ్‌లో సత్తా.. కళల్లోనూ బహుముఖ ప్రజ్ఞ**

**నవంబర్‌లో ప్రపంచ వేదికపై భారత్‌కు ప్రాతినిధ్యం**

**జైపూర్, ఆగస్టు 24 (చురకలు) :** కేరళకు చెందిన 19 ఏళ్ల లా విద్యార్థిని, మోడల్ కాజియా లిజ్ మెజో అందాల ప్రపంచంలో మరో అరుదైన ఘనత సాధించారు. జైపూర్‌లో అట్టహాసంగా జరిగిన 'మిస్ యూనివర్స్ ఇండియా-2026' గ్రాండ్ ఫినాలేలో 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి విజేతగా నిలిచారు. ప్రతిష్ఠాత్మక కిరీటాన్ని సొంతం చేసుకున్న కాజియా.. నవంబర్‌లో పోర్టోరికో వేదికగా జరగనున్న 75వ మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారు. కేరళకు చెందిన కాజియా బాల్యం ఎక్కువగా యూఏఈలోని అబుదాబిలో గడిచింది. అక్కడి ఎమిరేట్స్ నేషనల్ స్కూల్, సెయింట్ జోసెఫ్ స్కూల్, అబుదాబి ఇండియన్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేశారు. ప్రస్తుతం న్యాయ విద్య అభ్యసిస్తూనే మోడలింగ్‌లో రాణిస్తున్నారు. అందాల పోటీలకే పరిమితం కాకుండా కళారంగంలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

**నాట్యం నుంచి నటన వరకు..**

కాజియా 12 ఏళ్ల పాటు శాస్త్రీయ నృత్యంలో శిక్షణ పొందారు. గానం, సంగీతంపైనా ఆమెకు మంచి పట్టు ఉంది. డ్రమ్స్, వయోలిన్ వాయించగలరు. బహిరంగ ప్రసంగాలు, నటనలోనూ అనుభవం సంపాదించారు. మలయాళ చిత్రం 'షైలాక్' ద్వారా నటిగా వెండితెరకు పరిచయమయ్యారు. చిన్న వయసులోనే అందాల పోటీల్లో విజయాల పరంపర మొదలుపెట్టారు. 17 ఏళ్ల వయసులో 'మిస్ టీన్ దివా-2024' కిరీటాన్ని గెలుచుకున్నారు. 2025 మిస్ టీన్ ఇంటర్నేషనల్ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి తొలి రన్నరప్‌గా నిలిచారు. ఈ ఏడాది 'మిస్ యూనివర్స్ కేరళ--2026' విజేతగా నిలవడంతో పాటు ఆ కిరీటాన్ని గెలుచుకున్న అత్యంత పిన్న వయస్కురాలిగా గుర్తింపు పొందారు. తాజాగా జాతీయ కిరీటాన్ని కూడా తన ఖాతాలో వేసుకున్నారు.

**52 మందిలో మేటిగా..**

జైపూర్‌లో జరిగిన తుది పోరులో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 52 మంది ఫైనలిస్టులు పోటీపడ్డారు. చివరకు కాజియా లిజ్ మెజో విజేతగా నిలవగా, తమిళనాడుకు చెందిన వైష్ణవి గణేష్ తొలి రన్నరప్‌గా, గుజరాత్‌కు చెందిన అనుశ్రీ సాతవ్లేకర్ రెండో రన్నరప్‌గా నిలిచారు. అనుశ్రీ 'మిస్ ఇంటర్నేషనల్ ఇండియా--2026' టైటిల్‌ను కూడా దక్కించుకున్నారు. ఈ గ్రాండ్ ఫినాలేలో మాజీ విశ్వసుందరి సుస్మితా సేన్‌తో పాటు ఊర్వశి రౌతేలా, సెలీనా జైట్లీ తదితరులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఇప్పుడు కాజియా లక్ష్యం ప్రపంచ కిరీటం. నవంబర్‌లో జరిగే మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్ తరఫున ఆమె ప్రదర్శనపై అందరి దృష్టి నిలవనుంది.

# 22ఏపై అపోహలొద్దు

- లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో చేర్చామనడం పచ్చి అబద్ధం
- దరఖాస్తుల్లో 98శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి
- నిజమైన సమస్యలకు 24 నుంచి 36 గంటల్లో పరిష్కారం
- నకిలీ జీవోలు, బోగస్ మెమోలతో భూదందాలు చేస్తే క్రిమినల్ కేసులు
- ప్రభుత్వ భూమిని ప్రైవేటుగా మార్చే ప్రయత్నాలను సహించం: మంత్రి పొంగులేటి
- పట్టణ భూ గరిష్ఠ పరిమితి భూములపై త్వరలో విధాన నిర్ణయం
- ప్రధాన ప్రతిపక్షం కోరితే 811 ఎకరాల వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు




**హైదరాబాద్, ఆగస్టు 24 (చురకలు) :** రాష్ట్రంలో 22ఏ పేరుతో లక్షలాది ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చారంటూ జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 22ఏపై ప్రతిపక్షాలు అవాస్తవాలు ప్రచారం చేస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ సమస్యల పరిష్కారానికి వేగవంతమైన విధానాన్ని అమలు చేస్తున్నామని, ఇప్పటికే అనుమతి పొందిన కేసుల్లో దాదాపు 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని వెల్లడించారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పొంగులేటి మాట్లాడారు. 2023 డిసెంబర్ 7 నాటికి నిషేధిత జాబితాలో ఎంత భూమి ఉంది? ప్రస్తుతం ఎంత ఉంది? అటవీ, వక్ఫ్, దేవాదాయ, అసైన్డ్, ప్రభుత్వ, కోర్టు ఆదేశాలకు సంబంధించిన భూములు ఏ మేరకు ఉన్నాయి? అనే వివరాలను కేటగిరీల వారీగా ప్రభుత్వం ప్రజల ముందు ఉంచుతోందన్నారు. "లక్షల ఎకరాలు 22ఏలో పెట్టారని ఆరోపించడం సులభం. ఎంత భూమి ఉంది? ఎందుకు నిషేధిత జాబితాలో పెట్టారు? అది ఎవరి భూమి? ఏ కారణంతో చేర్చారు? అన్న ప్రతి అంశానికీ రికార్డులతో సమాధానం చెబుతాం. వాస్తవాలు ప్రజల ముందుకు వస్తే ఎవరు నిజం చెబుతున్నారో వారే నిర్ణయిస్తారు" అని పొంగులేటి పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు, ప్రజా ఆస్తులు ప్రైవేట్ వ్యక్తులు, స్థిరాస్తి వ్యాపారుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడటమే 22ఏ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని రెండు రెవెన్యూ గ్రామాల్లో 122 ఎకరాలు, మరో ప్రాంతంలో 400 ఎకరాలకు పైగా కలిపి సుమారు 522 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించిన వ్యవహారాలను మంత్రి ఉదాహరణగా ప్రస్తావించారు. ఎన్నికలకు ముందే ఈ వ్యవహారాలు చర్చకు వచ్చాయని చెప్పారు. ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా మార్చే ప్రయత్నాలు జరిగితే వాటిని నిషేధిత జాబితాలో పెట్టడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు నకిలీ జీవోలు, బోగస్ మెమోలు, అధికారుల సంతకాలతో తప్పుడు ధ్రువపత్రాలు సృష్టిస్తున్న వ్యవహారాలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయని మంత్రి వెల్లడించారు. మేడ్చల్ జిల్లాలో ఏప్రిల్ 22 తేదీతో కలెక్టర్ సంతకం చేసినట్లు నకిలీ మెమో, మరోచోట జూన్ 2 తేదీతో ప్రత్యేక ఉప కలెక్టర్ పేరుతో బోగస్ ధ్రువపత్రం సృష్టించినట్లు గుర్తించామన్నారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టానికి సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం త్వరలోనే విధానపరమైన నిర్ణయం తీసుకుంటుందని పొంగులేటి ప్రకటించారు. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్, మేడ్చల్-మల్కాజిగిరి ప్రాంతాల్లో ఉన్న సమస్యలను పరిశీలిస్తున్నామన్నారు. ఇప్పటికే క్లియరెన్స్ పొందిన భూములకు సంబంధించిన ఉత్తర్వులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సమస్యలు పరిష్కరిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో సీఎస్--7, సీఎస్--14కు సంబంధించిన 811 ఎకరాల భూ వ్యవహారంపై ప్రధాన ప్రతిపక్షం కోరితే ప్రత్యేక దర్యాప్తునకు ఆదేశిస్తామని మంత్రి ప్రకటించారు. 2017లో అప్పటి ప్రభుత్వానికి సంబంధించిన ఒక పత్రిక ఎండీ, భూస్వామి నుంచి ఖరీదైన కారు తీసుకుని ఐదు పత్రాల ద్వారా 811 ఎకరాల రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే అంశాన్ని ఆయన ప్రస్తావించారు. 22ఏ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌కు ఇప్పటివరకు 1,162 కాల్స్ వచ్చాయని మంత్రి తెలిపారు. పునరావృతమైన ఫిర్యాదులను తొలగిస్తే 980 ప్రత్యేక ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు. వాటిలో 547 వ్యవసాయ భూములకు, 433 వ్యవసాయేతర భూములకు సంబంధించినవని వివరించారు. రంగారెడ్డి నుంచి అత్యధికంగా 258, మేడ్చల్ నుంచి 149, సంగారెడ్డి నుంచి 82 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే అనుమతి పొందిన 22ఏ కేసుల్లో సుమారు 98 శాతం రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకున్నామని పొంగులేటి వెల్లడించారు. 300కు పైగా స్లాట్లలో దేవాదాయ, భూదాన్ తదితర కారణాలతో రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేని 12 నుంచి 13 కేసులను మాత్రమే తిరస్కరించామన్నారు. రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించి కూడా రిజిస్ట్రేషన్ చేసుకోలేకపోయిన వారికి ఈ వారాంతంలోగా డబ్బును తిరిగి ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. 22ఏకు సంబంధించి వాస్తవమైన సమస్యలను 24 గంటల్లో, ప్రత్యేక పరిస్థితుల్లో గరిష్ఠంగా 36 గంటల్లో పరిష్కరించేలా వేగవంతమైన విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. "ప్రజలను భయపెట్టడం మా ప్రభుత్వ విధానం కాదు. వారికి భరోసా ఇవ్వడం మా బాధ్యత. ప్రభుత్వ భూములను కాపాడటం ఎంత ముఖ్యమో.. చట్టబద్ధమైన ప్రైవేట్ ఆస్తులకు రక్షణ కల్పించడం కూడా అంతే ముఖ్యం. తప్పు జరిగితే సరిదిద్దుతాం.. అక్రమం జరిగితే చర్యలు తీసుకుంటాం. కానీ అబద్ధాలతో ప్రజలను భయాందోళనలకు గురిచేస్తే చూస్తూ ఊరుకోం" అని పొంగులేటి స్పష్టం చేశారు. సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్‌కుమార్, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంతు, హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రైతు ఉద్యమ పెద్దదిక్కు ఇకలేరు

- ప్రముఖ రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి కన్నుమూత
- 88 ఏళ్ల వయసులో అనారోగ్యంతో తుదిశ్వాస
- రైతు సమస్యలపై దశాబ్దాల పాటు అలుపెరుగని పోరాటం
- అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా కీలక సేవలు
- కమ్యూనిస్టు, రైతు సంఘాల్లో విషాదఛాయలు



**హైదరాబాద్, ఆగస్టు 24 (చురకలు) :** రైతాంగ సమస్యలపై దశాబ్దాల పాటు అలుపెరుగని పోరాటం సాగించిన కమ్యూనిస్టు సీనియర్ నాయకుడు, ప్రముఖ రైతు సంఘం నేత సారంపల్లి మల్లారెడ్డి (88) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని నిజాం వైద్య విజ్ఞాన సంస్థ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో కమ్యూనిస్టు, రైతు సంఘాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన సారంపల్లి మల్లారెడ్డి తన జీవితంలో అత్యధిక భాగాన్ని రైతాంగ ఉద్యమాలకే అంకితం చేశారు. వ్యవసాయ రంగ సమస్యలు, రైతుల హక్కులు, భూములకు సంబంధించిన వివాదాలు, రైతు కూలీల సంక్షేమం వంటి అంశాలపై నిరంతరం పోరాటాలు సాగించారు. రైతుల పక్షాన ప్రభుత్వాలను నిలదీయడంలో ముందుండేవారు. క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్మించడంలో మల్లారెడ్డి కీలక పాత్ర పోషించారు. రైతాంగానికి సంబంధించిన విధానపరమైన అంశాలపైనా ఆయనకు విశేష అవగాహన ఉండేది. రైతుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటిపై విస్తృత చర్చ జరిగేలా కృషి చేశారు. అనేక రైతు ఉద్యమాలకు నాయకత్వం వహించి కొత్తతరం కార్యకర్తలకు మార్గదర్శకుడిగా నిలిచారు. అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన మల్లారెడ్డి.. రైతు సంఘాన్ని బలోపేతం చేయడంలో తనదైన ముద్ర వేశారు. కమ్యూనిస్టు ఉద్యమంతో మమేకమై రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం చివరి వరకు తన గళాన్ని వినిపించారు.

**ఉద్యమ ప్రస్థానానికి ముగింపు**

మల్లారెడ్డి మృతిపై కమ్యూనిస్టు పార్టీలు, రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రైతాంగ ఉద్యమానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, రైతుల పక్షాన నిలిచిన నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయామని సంతాపం తెలిపారు. మల్లారెడ్డి పార్థివదేహాన్ని హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో అభిమానులు, రైతు సంఘాల నేతలు, కార్యకర్తలు, ప్రజల సందర్శనార్థం మధ్యాహ్నం వరకు ఉంచనున్నట్లు సమాచారం. అనంతరం అంత్యక్రియలకు సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు వెల్లడించనున్నారు.

## సీఎం, కూనంనేని, హరీశ్‌రావు సంతాపం





సారంపల్లి మల్లారెడ్డి మృతికి సీఎం రేవంత్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. రైతుల హక్కులు, సాగునీరు, రుణాలు, విత్తనాలు మరియు భూమి సమస్యల పరిష్కారం కోసం జీవితాన్ని అంకితం చేసిన మల్లారెడ్డి సేవలు చిరస్మరణీయమని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా ఆయన అందించిన కృషిని గుర్తుచేసుకుంటూ, ఆయన కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలిపారు. మల్లారెడ్డి మృతి కమ్యూనిస్టు, రైతాంగ ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులపై ఆయనకు లోతైన అవగాహన ఉండేదని, అసెంబ్లీ సమావేశాల సమయంలో ప్రజాప్రతినిధులకు ఆయన ఇచ్చిన సూచనలు ఎంతో ఉపయోగపడేవని గుర్తుచేసుకున్నారు. మల్లారెడ్డి పోరాట జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతాంగ సంక్షేమం కోసం ఆయన చేసిన పోరాటాలను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, కుటుంబ సభ్యులకు మరియు అభిమానులకు నాయకులు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

- సెప్టెంబర్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వారం రోజుల ఆందోళనలు
- 420 హామీలు.. 13 డిక్లరేషన్లు.. 6 గ్యారెంటీలపై నిలదీత
- 'బాకీ కార్డుల' ప్రచారాన్ని మళ్లీ ప్రజల్లోకి తీసుకెళ్దాం
- గ్రామం నుంచి నగరం వరకు కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన కేటీఆర్



**హైదరాబాద్, ఆగస్టు 24 (చురకలు):** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుంటున్న వేళ.. ప్రభుత్వ వైఫల్యాలే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్త పోరాటానికి బీఆర్ఎస్ సిద్ధమైంది. సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో ఆందోళనలు, ప్రజా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గ్రామగ్రామాన ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో కేటీఆర్ వారం రోజుల కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వాటిని అమలు చేస్తామని చెప్పిందని గుర్తుచేశారు. ఇప్పుడు వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ వర్గాలకు ఎంత బాకీ పడిందో ప్రజలకు వివరించేందుకు గతంలో చేపట్టిన 'బాకీ కార్డు' ప్రచారాన్ని మరింత విస్తృతంగా నిర్వహించాలని కేటీఆర్ సూచించారు. రైతులు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏమిటి? ఇప్పటివరకు అందింది ఎంత? ఇంకా రావాల్సింది ఎంత? అనే వివరాలతో ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి ఇంటికీ వెళ్లి కాంగ్రెస్ హామీల అమలుపై ప్రజలతో చర్చించాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు. ప్రభుత్వంపై కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా ఆయా వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల ముందుంచాలని సూచించారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రధాన అంశంగా తీసుకోవాలని కేటీఆర్ సూచించారు. సుమారు రూ.12 వేల కోట్ల బకాయిల కారణంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆరోపించారు. కళాశాలలకు వెళ్లి విద్యార్థులు, తల్లిదండ్రులు, యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వాన్ని నిలదీయాలని చెప్పారు. యువతకు ఉద్యోగాల కల్పనలోనూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు, విద్యార్థుల సమస్యలను ప్రత్యేకంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, దళితులు, బీసీలు, గిరిజనులు, ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించాలని కేటీఆర్ సూచించారు. ఆయా వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ వాటి అమలు పరిస్థితిని వివరించాలని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి వంద రోజుల నుంచి ఇప్పటివరకు చోటుచేసుకున్న పరిపాలనా వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావించాలని దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి ఆందోళనలతోపాటు సామాజిక మాధ్యమాల్లోనూ విస్తృత ప్రచారం నిర్వహించాలని కేటీఆర్ సూచించారు. యువతను ఆకట్టుకునేలా వినూత్న ప్రచార కార్యక్రమాలు రూపొందించి కాంగ్రెస్ హామీలు, వాటి అమలు తీరును ప్రజల ముందుంచాలని చెప్పారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ బాధ్యులు, సీనియర్ నాయకులు వారం రోజుల కార్యక్రమాల్లో పూర్తిస్థాయిలో పాల్గొనాలని ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ యంత్రాంగమంతా కదిలి కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై ప్రజాక్షేత్రంలో నిలదీయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# శాసనసభ కమిటీలదే కీలక పాత్ర

- ప్రభుత్వ శాఖల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ
- సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా చూడాలి
- క్షేత్రస్థాయి పర్యటనలతో లోటుపాట్లను గుర్తించాలి
- ప్రభుత్వానికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలి
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 24 (చురకలు):** ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ కమిటీలదే కీలక పాత్ర అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ శాఖల పనితీరును నిరంతరం సమీక్షిస్తూ, సంక్షేమ పథకాల ఫలాలు అర్హులకు సమర్థవంతంగా చేరేలా చూడాల్సిన బాధ్యత కమిటీలపై ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలును పరిశీలించి లోటుపాట్లను గుర్తించడంతోపాటు వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి సలహాలు, సూచనలు అందించాలని పేర్కొన్నారు. శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో సోమవారం లెజిస్లేచర్ మైనారిటీల సంక్షేమ కమిటీ, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కమిటీల ప్రారంభ సమావేశం జరిగింది. నూతన కమిటీ చైర్మన్లు, సభ్యులకు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కార్యదర్శులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ శాసనసభ కమిటీలు కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా ప్రభుత్వ శాఖల పనితీరుపై నిరంతరం నిఘా పెట్టాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు లక్ష్యాలకు అనుగుణంగా అమలవుతున్నాయా? కేటాయించిన నిధులు సక్రమంగా ఖర్చవుతున్నాయా? పథకాల ప్రయోజనాలు అర్హులకు అందుతున్నాయా? అనే అంశాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. మైనారిటీల విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అధికారుల నుంచి సమాచారం తెప్పించుకోవడంతోపాటు కమిటీ సభ్యులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని చెప్పారు. షెడ్యూల్డ్ కులాలకు అమలవుతున్న సంక్షేమ పథకాల్లో లోటుపాట్లను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి స్పష్టమైన సూచనలు చేయాలని పేర్కొన్నారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఏ మేరకు ఖర్చయ్యాయనే అంశంపైనా సమగ్ర వివరాలు సేకరించాలని సూచించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ తాను 2008లో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్ర జనాభాలో సుమారు 18 శాతం ఉన్న షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతి, సంక్షేమం కోసం కమిటీ మరింత క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. వారి ప్రాథమిక అవసరాలను గుర్తించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించాలన్నారు. కమిటీ సభ్యులు తమ అనుభవం, అవగాహనతో అధికారులతో సమన్వయం చేసుకుంటూ మైనారిటీలు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. సమావేశంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మైనారిటీల సంక్షేమ కమిటీ చైర్మన్ తోట లక్ష్మీకాంతారావు, సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, పాయల్ శంకర్, ఎస్సీ సంక్షేమ కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం, సభ్యులు వెడ్మ బొజ్జు, కేఆర్ నాగరాజు, కవ్వంపల్లి సత్యనారాయణ, విజయుడు, శ్రీపాల్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, మండలి కార్యదర్శి వి.నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి

## ప్రభుత్వానికి మానవహక్కుల కమిషన్ ఆదేశాలు

**హైదరాబాద్, ఆగస్ట్ 24 (చురకలు) :** తెలంగాణ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, తరగతి గదులు, మరుగుదొడ్లు తదితర ప్రాథమిక సౌకర్యాలపై కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తగిన తరగతి గదులు, మరుగుదొడ్లు మరియు ఇతర ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు చెట్ల కింద, వరండాల్లో, కమ్యూనిటీ భవనాల్లో తరగతులకు హాజరవుతున్నారంటూ ప్రచురితమైన వార్త ఆధారంగా కమిషన్ సుమోటోగా కేసును స్వీకరించింది. కమిషన్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్, జనగాం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల జిల్లా విద్యాశాఖాధికారుల నుంచి నివేదికలు అందాయి. ఆయా నివేదికలను పరిశీలించగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థలో ఉన్న తరగతి గదులు, మరమ్మతులు అవసరమైన తరగతి గదులు, మరుగుదొడ్ల కొరత వంటి మౌలిక వసతుల లోపాలు ఉన్నట్లు వెల్లడైంది. నల్గొండ జిల్లా, నిడమనూరు మండలం, ఊట్కూర్ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి స్వయంగా పరిశీలించినట్లు నివేదికలో పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా పాత రేకుల పైకప్పు తరగతి గదుల్లో లీకేజీలు ఏర్పడటంతో, మరమ్మతులు జరుగుతున్న సమయంలో విద్యార్థులను తాత్కాలికంగా చెట్ల కింద కూర్చోబెట్టి తరగతులు నిర్వహించినట్లు నివేదికలో వెల్లడించారు. విద్యార్థులకు సురక్షితమైన తరగతి గదులు, పారిశుధ్య సౌకర్యాలు, ఇతర ప్రాథమిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని కమిషన్ స్పష్టం చేసింది. విద్యా హక్కు కేవలం పాఠశాలలో ప్రవేశం కల్పించడంతో పరిమితం కాదని, పిల్లలు సురక్షితమైన, గౌరవప్రదమైన, అనుకూలమైన వాతావరణంలో విద్యను అభ్యసించే పరిస్థితులు కూడా అందులో భాగమేనని కమిషన్ పేర్కొంది. మిషన్ పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని రాష్ట్రంలోని అన్ని జిల్లాల జిల్లా విద్యాశాఖాధికారుల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ప్రాథమిక సౌకర్యాలపై నివేదికలు కోరాలని సిఫారసు చేసింది. అలాగే ఈ అంశాన్ని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించి, ప్రభుత్వ పాఠశాలల్లో సురక్షితమైన తరగతి గదులు, పనిచేసే మరుగుదొడ్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు, అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు, పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు తక్షణ మరియు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని కమిషన్ సిఫారసు చేసింది. చర్యల వివరాలను ఆరు నెలల్లోగా కమిషన్‌కు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది.




## కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలనలో

# కొండా సుష్మిత వ్యవహారం

- కాంగ్రెస్ పెద్దలు తీసుకునే నిర్ణయం కోసం వేచిచూస్తున్నాం
- సోషల్ మీడియాతో బతికేస్తున్న కేటీఆర్
- మెదక్‌లో కాంగ్రెస్ సమావేశంలో టీపీసీసీ చీఫ్



**మెదక్, ఆగస్ట్ 24 (చురకలు) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించిన తీరు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలు పట్టుబడుతున్న పరిస్థితి రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సురేఖ అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. సోమవారం మెదక్ హౌసింగ్ బోర్డులోని వినాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని చెప్పారు. ఇప్పటికే ప్రిలిమినరీ రిపోర్ట్‌ను ఏఐసీసీకి అందజేశామని.. డిటైల్డ్ రిపోర్ట్ వచ్చాక పెద్దలు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. కాంగ్రెస్ పెద్ద పార్టీ కాబట్టి చెప్పుకునే స్వేచ్ఛ ఎక్కువ ఉంటుందని మహేశ్ తెలిపారు. స్వేచ్ఛ హద్దులు దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని.. తనతో సహా అందరూ హద్దుల్లో ఉంటే మంచిదన్నారు. ప్రతి కుటుంబంలో సమస్యలు ఉన్నట్టుగానే కాంగ్రెస్ కుటుంబంలో కూడా ఉంటాయన్నారు. 'కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తకు న్యాయం జరుగుతుంది.. ఇది సీఎం మాట, నా మాట, మీనాక్షి నటరాజన్ మాట. ఎవ్వరికీ కూడా 100 శాతం న్యాయం చేయలేం.. నేను వాస్తవాలు మాట్లాడతా. 70 శాతం పదవులు పాత కాంగ్రెస్ నాయకులకే దక్కేలా అధిష్ఠానం హామీ ఇచ్చింది. ములుగులో మంత్రి సీతక్క పాత నాయకులకే పదవులు ఇచ్చారని తెలిపారు. సోషల్ మీడియాలో బీఆర్ఎస్, బీజేపీలు కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయని మహేశ్ మండిపడ్డారు. సోషల్ మీడియాపై కేటీఆర్ ఆశలు పెట్టుకున్నారని.. కత్తి దూసినోడు కత్తికే చనిపోతాడు అన్నట్టు కేటీఆర్‌ను సోషల్ మీడియానే ఖతం చేస్తుందని వ్యాఖ్యానించారు. పదేళ్లు బిఆర్ఎస్ చేసిన దోపిడీ, భూ దందా, అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదన్నారు. మల్లన్నసాగర్ కట్టేటప్పుడు ఎంతమందిపై కేసులు పెట్టి జైలుకి పంపారో జనాలు మర్చిపోలేదని తెలిపారు. ప్రధాని మోదీ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో మెదక్ ఎంపీ రఘునందన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉన్న ఉద్యోగాలు తీసేసిన ఘనత ప్రధాని మోదీది అంటూ విరుచుకుపడ్డారు. మోదీ హవా తగ్గిందని.. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆయన ఇంటికి పోక తప్పదన్నారు. ప్రజలు 39 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా ఇస్తే కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలలో ప్రజాస్వామ్య తక్కువన్నారు. దళితుడు రాజయ్య డిప్యూటీ సీఎంగా ఉంటే రాత్రికి రాత్రే పదవి నుంచి తొలగించారని, ఈటల రాజేందర్‌ను మెడ పట్టి గెంటేశారని మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

# కల్యాణలక్ష్మి కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

## దివ్యాంగ వధువులకు సాయాం కొనసాగించాలని హైకోర్టు ఆదేశం



**హైదరాబాద్, ఆగస్ట్ 24 (చురకలు) :** తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగులకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది. ఈ పథకాల కింద సాధారణ లబ్దిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. దీంతో దివ్యాంగ వధువులకు ఈ పథకాల కొనసాగింపునకు ఆదేశించింది.

# నకిలీ డీఎస్పీగా అవతారం

# రూ.1.20 కోట్ల మోసం..

## వలపన్ని పట్టుకుని అరెస్ట్ చేసిన హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు

**హైదరాబాద్, ఆగస్ట్ 24 (చురకలు) :** నగరంలో నకిలీ డీఎస్పీగా అవతారమెత్తి అమాయకులను మోసం చేస్తున్న కేవీపీ రాజు అలియాస్ డీఎస్పీ రాజును హైదరాబాద్ సీసీఎస్ ఈఓడబ్ల్యూ బృందం అరెస్ట్ చేసింది. తిరుపతి డీఎస్పీ పేరును ఉపయోగించుకుంటూ తనకు ఉన్నతస్థాయి పరిచయాలు ఉన్నాయని నమ్మిస్తూ పలువురి నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. బోగస్ కంపెనీల్లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని ఆశ చూపించి బాధితులను తన వలలోకి లాగినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ క్రమంలో ఓ బాధితుడి నుంచి ఏకంగా రూ.1.20 కోట్లు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. తెలంగాణతో పాటు ఏపీలోనూ పలువురిని ఇదే తరహాలో మోసం చేసినట్లు నిందితుడి పై ఆరోపణలు ఉన్నాయి. నకిలీ హోదాలు, అధికారుల పేర్లు ఉపయోగించుకుని బాధితుల్లో నమ్మకం కలిగించి డబ్బులు దండుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. 2021 నుంచి పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్న కేవీపీ రాజును ఎట్టకేలకు సీసీఎస్ ఈఓడబ్ల్యూ అధికారులు అరెస్ట్ చేశారు. కేవీపీ రాజు అలియాస్ డీఎస్పీ రాజుపై ఇప్పటికే మూడు క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నకిలీ డీఎస్పీగా తనను తాను పరిచయం చేసుకుంటూ భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసిన వ్యవహారంపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి ద్వారా మోసపోయిన బాధితులు ఇంకా ఎవరైనా ఉన్నారా, అతడి మోసాల వెనుక మరికొందరి ప్రమేయం ఉందా అనే కోణంలోనూ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. అరెస్ట్ అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

## సంపాదకీయం



# ధరల మంట పాలకులకు పట్టదా?

### నిత్యావసరాల నుంచి నిర్మాణ సామగ్రి వరకు భగ్గుమంటున్న ధరలు

పాలక పార్టీలకు రాజకీయాలు తప్ప ప్రజల రోజువారీ సమస్యలు పట్టడం లేదన్న భావన బలపడుతోంది. ఎన్నికలు వస్తే కొత్త పథకాలు, ఉచిత హామీలు, ఓటర్లను ఆకట్టుకునే ప్రకటనలు తెరపైకి వస్తున్నాయి. కానీ పేద, మధ్యతరగతి కుటుంబాల నడ్డి విరుస్తున్న ధరల పెరుగుదలపై మాత్రం అదే స్థాయిలో చర్చ కనిపించడం లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే అయినా, రాష్ట్రాల్లోని ప్రభుత్వాలైనా ధరల నియంత్రణకు నిరంతర పర్యవేక్షణ, సమగ్ర కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉంది. నిత్యావసరాల నుంచి ఇంటి నిర్మాణ సామగ్రి వరకు ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుతున్నాయి. బియ్యం, చక్కెర, బెల్లం, ఉల్లి, వెల్లుల్లి, ఎండుమిర్చి, వంటనూనెలు, పూలు, పండ్లు.. ఇలా ఏ వస్తువు ముట్టుకున్నా ధర షాక్ తగులుతోంది. సంపాదన అదే స్థాయిలో ఉండగా ఇంటి నెలవారీ బడ్జెట్ మాత్రం పెరుగుతుండటంతో మధ్యతరగతి కుటుంబాలు ఖర్చుల్లో కోత పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. సన్నరకం బియ్యం ధర కిలో రూ. 80 వరకు చేరడం సామాన్య కుటుంబాలను కలవరపెడుతోంది. బహిరంగ మార్కెట్లో సన్నరకాల ధాన్యం లభ్యత తగ్గడం, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరగడం, సరఫరా వ్యవస్థపై ఒత్తిడి వంటి కారణాలను మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు పౌరసరఫరాల సంస్థ వద్ద అవసరాలకు మించి సేకరించిన ధాన్యం భారీగా ఉన్నప్పటికీ దాన్ని సమర్థంగా మార్కెట్లోకి తీసుకొచ్చి ధరలను నియంత్రించగలిగామా అన్న ప్రశ్న తలెత్తుతోంది. చింతపండు ధర రూ. 200 దాటుతోంది. చక్కెర ధర కూడా అనూహ్యంగా పెరిగింది. ఉల్లిగడ్డ ధర నెల వ్యవధిలోనే దాదాపు రెట్టింపైంది. జులై నాలుగో వారంలో కిలో రూ. 22 నుంచి రూ. 26 మధ్య ఉన్న ధర ఇప్పుడు రూ. 45 నుంచి రూ. 52 వరకు పలుకుతోంది. వెల్లుల్లి ధర రూ. 120--130 నుంచి రూ. 250 వరకు చేరింది. ఎండుమిర్చి రూ. 240 నుంచి రూ. 300కు ఎగబాకింది. లీటరు వంటనూనె ప్యాకెట్ రూ. 175 వరకు చేరుతోంది. బెల్లం కిలో రూ. 55 నుంచి రూ. 70--75 వరకు పెరిగింది. ఇలాంటి సమయంలో చక్కెర ధర పెరిగినా మధుమేహం కారణంగా ప్రజలపై పెద్దగా ప్రభావం ఉండదన్న తరహాలో బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు వ్యాఖ్యానించడం సమస్య తీవ్రతను తక్కువ చేసి చూపడమే అవుతుంది. ధర పెరుగుదల ఒక్క వస్తువుతో ఆగిపోదు. టీ దుకాణం నుంచి మిఠాయి తయారీ వరకు దాని ప్రభావం ఇతర వస్తువుల ధరలపైనా పడుతుంది. బోనాలు, శ్రావణమాస పూజలు, పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల సమయంలో పూలకు డిమాండ్ పెరగడం సహజమే. కానీ ఆ డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని కొన్ని ప్రాంతాల్లో ధరలను అమాంతం పెంచుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పూజకు పూలు, వంటకు సరుకులు, పెళ్లికి బంగారం.. ఏది కొనాలన్నా కుటుంబ బడ్జెట్‌ను ఒకటికి రెండుసార్లు చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బంగారం ధరలు పెళ్లిళ్లు చేసే కుటుంబాలకు మరింత భారంగా మారాయి. కనీస ఆభరణాలు, మంగళసూత్రం చేయించాలన్నా భారీ మొత్తం వెచ్చించాల్సి వస్తోంది. దీనికితోడు తయారీ చార్జీలు, తరుగు, పన్నులు కలిసేసరికి వినియోగదారుడిపై భారం మరింత పెరుగుతోంది. బంగారం కొనుగోలులో ధరలు, స్వచ్ఛత, తయారీ చార్జీల విషయంలో వినియోగదారులకు మరింత పారదర్శకత అవసరం. ఇల్లు కట్టుకోవాలనుకునే మధ్యతరగతి కుటుంబాల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. సిమెంట్, ఉక్కు, ఇటుక, ఇసుక నుంచి కార్మికుల కూలీల వరకు నిర్మాణ వ్యయం పెరుగుతోంది. అప్పు చేసి చిన్న ఇల్లు కట్టుకోవాలనుకున్న కుటుంబాలు అంచనా వ్యయం పెరగడంతో పనులను మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. మందుల ధరలు, ఆస్పత్రుల ఖర్చులు మరో పెద్ద సమస్య. విద్య, వైద్యం, ఇంటి అద్దె, ప్రయాణం వంటి తప్పనిసరి ఖర్చులకు తోడు నిత్యావసరాల ధరలు పెరిగితే సామాన్యుడి సంపాదనలో పొదుపునకు చోటెక్కడ? ఉత్పత్తి తగ్గింది.. సరఫరా దెబ్బతింది.. వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదు.. పండగల డిమాండ్ పెరిగింది.. అంటూ ధరల పెరుగుదలకు రోజుకో కారణం వినిపిస్తోంది. కానీ ప్రభుత్వాలు చేయాల్సింది కారణాలు చెప్పడం కాదు.. కారణాలను ముందుగానే గుర్తించి ధరల మంట సామాన్యుడికి తగలకుండా చూడటం. దేశంలో ఏ పంట ఎంత పండుతోంది? ఎంత వినియోగం ఉంది? ఎంత నిల్వ ఉంది? ఏ రాష్ట్రంలో కొరత ఏర్పడుతోంది? ఎక్కడ మిగులు ఉంది? సరఫరాలో ఎక్కడ ఆటంకం ఏర్పడుతోంది? అక్రమ నిల్వలు జరుగుతున్నాయా? కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా? అన్న అంశాలను నిరంతరం పర్యవేక్షించాలి. అవసరమైనప్పుడు నిల్వలను మార్కెట్లోకి విడుదల చేయాలి. అక్రమ నిల్వదారులు, బ్లాక్ మార్కెటీర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. విమాన ప్రయాణాన్ని సామాన్యులకు చేరువ చేస్తామని ప్రభుత్వాలు చెబుతున్నా, పండగలు, సెలవులు, రద్దీ సమయాల్లో టికెట్ ధరలు సామాన్యుడికి అందనంతగా పెరుగుతున్న సందర్భాలు ఉన్నాయి. విమానయాన రంగంలో పోటీ, సేవలు, ఛార్జీల తీరుపైనా ప్రభుత్వ పర్యవేక్షణ అవసరం. ప్రజలకు సేవలు అందుబాటులోకి తీసుకురావడం అంటే విమానాశ్రయాలు నిర్మించడం ఒక్కటే కాదు.. ఆ సేవలను భరించగలిగే స్థాయిలో ఉంచడం కూడా ముఖ్యమే. రాజకీయ పార్టీలు ఒకరి ఉచిత హామీలను మరొకరు విమర్శించుకోవడంలో చూపుతున్న ఆసక్తి ధరల పెరుగుదలపై కనిపించడం లేదు. అధికారంలో ఉన్నవారు తమ పథకాల గొప్పతనాన్ని ప్రచారం చేసుకుంటుంటే, ప్రతిపక్షాలు కూడా ప్రజల రోజువారీ జీవన వ్యయంపై నిర్మాణాత్మక చర్చకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉంది. పార్లమెంటు, శాసనసభలు రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకే పరిమితం కాకూడదు. బియ్యం ఎందుకు పెరిగింది? చక్కెర ఎందుకు ఎగబాకింది? ఉల్లి ధర ఎందుకు రెట్టింపైంది? వంటనూనెల ధరలను ఎలా తగ్గించాలి? అక్రమ నిల్వలను ఎలా అడ్డుకోవాలి? మధ్యతరగతి కుటుంబాల జీవన వ్యయాన్ని ఎలా తగ్గించాలి? అన్న అంశాలపై చర్చ జరగాలి. ఎన్నికల సమయంలో ఓటరే రాజు అని చెప్పే నేతలను.. ఎన్నికల మధ్యకాలంలోనూ ప్రజలే ప్రశ్నించాలి. ఉచితంగా ఏం ఇస్తారన్నదే కాదు.. సంపాదించిన రూపాయికి ఎంత విలువ మిగిలేలా పాలిస్తున్నారు? అని నిలదీయాలి. ఎందుకంటే సామాన్యుడికి కావాల్సింది ప్రకటనల ఉపశమనం కాదు.. మార్కెట్‌కు వెళ్లినప్పుడు కనిపించే నిజమైన ధరల ఉపశమనం.

# ఆయుధాల వేటలో పాక్.. కొత్త కూటమిపై కన్ను!

- ఆపరేషన్ సిందూర్ తర్వాత సైనిక సామర్థ్యాల పెంపుపై దృష్టి
- టర్కీ సైనిక విమానాల రాకపోకలతో కొత్త అనుమానాలు
- డ్రోన్లు, సైనిక సామగ్రి తరలిస్తున్నట్లు నివేదికలు
- మక్కా రక్షణ ఒప్పందంలోకి ఇరాన్‌ను ఆహ్వానించినట్లు కథనాలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ తన సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్లు వస్తున్న వార్తలు ఆసక్తి రేపుతున్నాయి. ఓవైపు టర్కీ, చైనా నుంచి ఆయుధాలు, డ్రోన్లు, ఇతర సైనిక సామగ్రిని సమకూర్చుకుంటున్నట్లు ప్రచారం జరుగుతుండగా.. మరోవైపు ఇస్లామిక్ దేశాలతో సమష్టి రక్షణ కూటమిని విస్తరించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. అయితే ఆయుధాల సరఫరా, ప్రతిపాదిత రక్షణ కూటమికి సంబంధించిన పలు అంశాలపై సంబంధిత దేశాల నుంచి అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది. పాకిస్థాన్‌లోని కీలక వైమానిక స్థావరాలకు ఇటీవల టర్కీ సైనిక రవాణా విమానాల రాకపోకలు పెరిగినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. రావల్పిండిలోని నూర్‌ఖాన్, కరాచీలోని మసూర్ వైమానిక స్థావరాలకు ఆగస్టు 19 నుంచి 21 మధ్య టర్కీకి చెందిన సైనిక రవాణా విమానాలు వచ్చి వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. వీటి ద్వారా డ్రోన్లు, వాటికి సంబంధించిన పరికరాలు లేదా ఇతర సైనిక సామగ్రిని తరలించి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే దీనిపై పాకిస్థాన్, టర్కీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. టర్కీ తయారీ మానవరహిత యుద్ధ వ్యవస్థలపై పాకిస్థాన్ కొంతకాలంగా ఆసక్తి చూపుతోంది. ఇప్పటికే బైరక్తార్ టీబీ-2 తరహా డ్రోన్లు పాక్ వద్ద ఉన్నట్లు సమాచారం. భవిష్యత్ యుద్ధ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఎక్కువసేపు గాల్లో ఉండగల డ్రోన్లు, లక్ష్యంపై వేచి ఉండి దాడి చేసే మానవరహిత ఆయుధ వ్యవస్థలను మరింతగా సమకూర్చుకునే ప్రయత్నాల్లో పాక్ ఉన్నట్లు రక్షణ వర్గాల్లో చర్చ సాగుతోంది. చైనా నుంచి కూడా వాయురక్షణ వ్యవస్థలు సహా సైనిక సామగ్రిని సమకూర్చుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇదే సమయంలో పశ్చిమాసియాలో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో పాకిస్థాన్, సౌదీ అరేబియా, టర్కీ మధ్య సమష్టి రక్షణ వ్యవస్థ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. దీనిని 'మక్కా సమష్టి రక్షణ ఒప్పందం'గా పేర్కొంటూ, మరికొన్ని ఇస్లామిక్ దేశాలను కూడా ఇందులోకి తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ కూటమిలో చేరాలని ఇరాన్‌కు సైతం ఆహ్వానం అందినట్లు పశ్చిమాసియా మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఇరాన్ విదేశాంగ శాఖ నుంచి దీనిపై అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది. సౌదీ అరేబియా, ఇరాన్ మధ్య గతంలో నెలకొన్న ఉద్రిక్తతలు, హూతీల విషయంలో ఉన్న విభేదాల నేపథ్యంలో ఇరాన్ చేరిక ఎంతవరకు సాధ్యమవుతుందన్నది ప్రశ్నార్థకంగా మారింది. అణ్వస్త్ర సామర్థ్యం కలిగిన పాకిస్థాన్, నాటో సభ్యదేశమైన టర్కీ, పశ్చిమాసియాలో కీలక శక్తిగా ఉన్న సౌదీ అరేబియా ఒకే రక్షణ వ్యవస్థ కిందకు వస్తే ప్రాంతీయ వ్యూహాత్మక సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముంది. అయితే ప్రస్తుతం ప్రచారంలో ఉన్న 'మక్కా ఒప్పందం', అందులోని నిబంధనలు, ఇరాన్‌కు ఆహ్వానం వంటి అంశాలకు అధికారిక నిర్ధారణ లభించిన తర్వాతే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# గో స్మగ్లర్లపై పోలీసుల తూటా!

### మీరట్‌లో పోలీసులకు, స్మగ్లర్లకు మధ్య కాల్పులు

### ఎదురుకాల్పుల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు





**ఉత్తర్‌ప్రదేశ్, ఆగస్టు 24:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్‌లో గోవుల అక్రమ రవాణా, గోవధకు పాల్పడుతున్నారన్న సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులకు, అనుమానిత స్మగ్లర్లకు మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో తస్లీమ్, భూరా అనే ఇద్దరు నిందితులు తీవ్రంగా గాయపడ్డారు. మీరట్‌లోని ఓ ప్రాంతంలో కొందరు గోవులను అక్రమంగా తరలించడంతో పాటు గోవధకు పాల్పడుతున్నారన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. సంఘటన స్థలంలో ఓ గోవు చెట్టుకు కట్టేసి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులను గమనించిన తస్లీమ్, భూరా కాల్పులకు దిగారని పోలీసులు పేర్కొన్నారు. దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురుకాల్పులు జరిపినట్లు తెలిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరూ గాయపడగా వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో మరో నిందితుడు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు చెబుతున్నారు. అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. తస్లీమ్‌పై ఇప్పటికే 15 కేసులు, భూరాపై 10 కేసులు ఉన్నట్లు సమాచారం. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఇంజనీరింగ్ విద్యార్థికి 'ఉగ్ర' లింకులు?

### రామగుండంలో ఎన్ఐఏ తనిఖీల కలకలం

### ముజామిల్ ఖాన్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు

### ఎన్‌టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ముమ్మరంగా ప్రశ్నలు



**పెద్దపల్లి, ఆగస్ట్ 24:** పెద్దపల్లి జిల్లా రామగుండంలో ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నాయన్న అనుమానాలు కలకలం రేపాయి. అయోధ్యనగర్‌లో జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో భాగంగా రామగుండానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి ముజామిల్ ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఉగ్రవాద సంస్థలతో ముజామిల్‌కు సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. అనంతరం అతడిని ఎన్‌టీపీసీ పోలీస్‌స్టేషన్‌కు తరలించి ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ముజామిల్ కార్యకలాపాలు, ఇటీవల అతడు ఎవరెవరితో సంప్రదింపులు జరిపాడు, అతడి పరిచయాలు ఏమిటి, అనుమానిత సంస్థలు లేదా వ్యక్తులతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణాల్లో అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. అతడి డిజిటల్ కార్యకలాపాలు, ఇతర సంబంధాలపైనా దర్యాప్తు సాగుతున్నట్లు సమాచారం. అయితే ముజామిల్‌కు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న విషయం అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. ప్రస్తుతం అతడిని అనుమానాల నేపథ్యంలో ప్రశ్నిస్తున్నట్లు మాత్రమే సమాచారం ఉండటంతో దర్యాప్తు పూర్తయ్యే వరకు దీనిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు.

# సింఘేశ్వర ఆలయం వద్ద తోపులాట

### ఆరుగురు భక్తులకు గాయాలు

### శ్రావణ సోమవారం కావడంతో ఆలయానికి పోటెత్తిన జనం

### అకస్మాత్తుగా కూలిన బారికేడ్.. భయాందోళనలో భక్తులు

### గత వారమే లఖిసరాయ్ ఘటనలో ఏడుగురు మృతి



**బిహార్, ఆగస్టు 24:** బిహార్: మధేపురాలోని సింఘేశ్వర ఆలయం వద్ద సోమవారం ఉదయం తొక్కిసలాట లాంటి పరిస్థితి తలెత్తింది. శ్రావణ సోమవారం కావడంతో సింఘేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. అయితే, భద్రతా చర్యల్లో భాగంగా పోలీసులు ఏర్పాటు చేసిన ఓ బారికేడ్ అకస్మాత్తుగా కూలిపోయింది. దీంతో భక్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. వెంటనే తొక్కిసలాట వంటి పరిస్థితి నెలకొంది. ఒకరినొకరు తోసుకోవడంతో సుమారు ఆరుగురు భక్తులు గాయపడ్డారు. అనంతరం వారిని చికిత్స నిమిత్తం మధేపురాలోని జననాయక్ కర్పూరి ఠాకూర్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. అయితే, ప్రమాదం గురించి తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ, మేజిస్ట్రేట్ అభిషేక్ రంజన్ సహా ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మరోవైపు, అదనపు బలగాలను కూడా మోహరించారు. పరిస్థితిని వెంటనే అదుపులోకి తీసుకువచ్చారు. అధికారులు నిర్దేశించిన మార్గదర్శకాలను భక్తులు పాటించాలని, ప్రశాంతంగా ఉండాలని ఆలయ ట్రస్ట్ కమిటీ కోరింది. కాగా, గత సోమవారం లఖిసరాయ్ జిల్లాలోని అశోక్ ధామ్ ఆలయం వద్ద తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. భారీ జనసందోహానికి తోడు విద్యుత్ స్తంభం కూలిపోయిందనే వదంతి కారణంగా తొక్కిసలాట జరిగినట్లు అధికారులు తెలిపారు.

# అమెరికా యుద్ధాన్ని కొనసాగిస్తే అంతే సంగతులు

### ఒక్కచుక్క చమురును కూడా సరఫారా కానివ్వం

### ఇరాన్ మరోమారు ఘాటు హెచ్చరికలు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 24 :** అమెరికా తమపై ఆర్థిక యుద్ధాన్ని కొనసాగిస్తే ఒక్క చుక్క చమురును కూడా సరఫరా కానివ్వమని ఇరాన్ హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధి విషయంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మొహ్సెన్ రెజాయీ ఈ హెచ్చరిక చేశారు. ఇరాన్‌పై అమెరికా కొత్త ఆర్థిక ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రెజాయీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఆర్థిక యుద్ధం కొనసాగితే హోర్ముజ్ జలసంధి ద్వారా మాత్రమే కాకుండా పర్షియన్ గల్ఫ్ నుంచి కూడా ఒక్క చుక్క చమురునూ ఎగుమతి చేయనీయమని రెజాయీ హెచ్చరించారు. అమెరికా ఆర్థిక చర్యలకు మద్దతు ఇచ్చే లేదా వాటిలో భాగస్వాములయ్యే దేశాలను కూడా ఇరాన్ శత్రువులుగా పరిగణిస్తుందని రెజాయీ హెచ్చరించారు. అలాంటి దేశాలపై ప్రతీకార చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్‌పై అమెరికా భారీ ఆర్థిక ఆంక్షలకు సిద్ధమవుతోంది. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఈ చర్యలను 'ఎకనామిక్ డీ-డే'గా అభివర్ణించారు. ఇరాన్‌తో వాణిజ్యం కొనసాగించే దేశాలు, సంస్థలపై కూడా కొత్త ఆంక్షలు విధించే అవకాశం ఉందన్నారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై గరిష్ఠ ఒత్తిడి తీసుకురావడమే తమ ఉద్దేశమని వాషింగ్టన్ చెబుతోంది. అయితే ఇరాన్ మాత్రం ఈ ఆంక్షలను ఎదుర్కొంటామని స్పష్టం చేస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్ ఇప్పటికే కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఈ మార్గంలో నౌకల రాకపోకలు భారీగా తగ్గాయి. ఈ వారాంతంలో 20 కంటే తక్కువ వాణిజ్య నౌకలు మాత్రమే హోర్ముజ్ గుండా వెళ్లినట్లు నౌకాయాన సమాచారం వెల్లడించింది. హోర్ముజ్ ద్వారా చమురు రవాణాకు అంతరాయం ఏర్పడితే ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.



# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**ఆసిఫాబాద్ టౌన్** : ఆసిఫాబాద్ పట్టణంలోని 16వ వార్డులో లబ్ధిదారులకు సోమవారం ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎం.డి. అహ్మద్ , కౌన్సిలర్ దూడల లక్ష్మి తో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ కార్డుల లబ్ధిదారులకు ప్రభుత్వం మరింత సులభంగా, పారదర్శకంగా సేవలు అందించేందుకు ఈ స్మార్ట్ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులందరికీ కార్డులు అందజేస్తున్నామని, ఇంకా తీసుకోని వారు వెంటనే తమ పరిధిలోని రేషన్ డీలర్‌ను సంప్రదించి స్మార్ట్ రేషన్ కార్డులను పొందాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది అభిషేక్ , రేషన్ డీలర్ శ్రీను, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# దయనీయ స్థితిలో నేరడిగొండ తహశీల్దార్ కార్యాలయం



: **నేరడిగొండ:** మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం దయనీయ స్థితిలో ఉంది. కురుస్తున్న వర్షాలకు పైకప్పు శిథిలమై లోపలికి వర్షపు నీరు చేరుతోంది. పైకప్పు పెచ్చులూడి గోడల వెంబడి నీరు కారుతోంది. కార్యాలయం నేల అంతా బురదమయంగా మారింది. బకెట్లతో నీటిని బయటకు తోడే పరిస్థితి ఏర్పడింది. గోడలకు ఉన్న విద్యుత్ వైర్లపై నీరు పడటంతో సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. రోజూ పనుల కోసం వచ్చే రైతులు, లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయంలో ఉన్న ముఖ్యమైన రెవెన్యూ రికార్డులు, దస్త్రాలు తడిసిపోయి దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి కార్యాలయానికి మరమ్మతులు చేయించి, కొత్త భవనం మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



: **ఆదిలాబాద్:** ప్రజావాణిలో వచ్చే అర్జీలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను ఓపికగా విన్నారు. త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో భూభారతి, చేయూత పింఛను, ఇందిరమ్మ ఇళ్లు, విద్య, వైద్యం, వివిధ శాఖలకు సంబంధించిన 63 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఒకే సమస్యపై దరఖాస్తుదారులు పలుమార్లు అర్జీలు సమర్పించకుండా, క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తీసుకున్న చర్యలపై దరఖాస్తుదారులకు సమాధానాన్ని అందజేయాలన్నారు. అనంతరం సెన్సెస్ హ్యాండ్ బుక్ తయారీతో పాటు, వివిధ శాఖల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు ఆర్ఎస్.చిత్రూ, రాజేశ్వర్, డిఆర్ఓ స్రవంతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై ఎంపీడీఓకు ఫిర్యాదు




: **కాగజ్నగర్:** కాగజ్ నగర్ మండలం వంజిరి గ్రామ ప ంచాయ తీ పరిధిలోని నందిగూడ, మహాన్గూడ గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, లూజ్ వైర్లు తదితర విద్యుత్ సంబంధిత సమస్యలను పరిష్కరించాలని వంజిరి సర్పంచ్ లక్ష్మి గోపాల్, ఉప సర్పంచ్ భారత్ కోరారు. సోమవారం ప్రజావాణి ఎంపీడీఓ ఉజ్వల్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు సక్రమంగా లేకపోవడం, లూజ్ వైర్లు వేలాడుతూ ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వెంటనే సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు.

# జర్నలిస్ట్స్ సంఘం నేత విరాహత్ అలీకి పలువురి పరామర్శ





: **గజ్వేల్:** మాతృ వియోగానికి గురైన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీని, గత ఆరు రోజులుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు, ఆయా రాజకీయ పార్టీల ప్రముఖులు, అధికారులు, ప్రజా సంఘాల బాధ్యులు, కార్మిక సంఘాలు, కుల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో గజ్వేల్ తరలివచ్చి పరామర్శిస్తున్నారు. ఇందులో భాగంగానే సోమవారం నాడు నర్సాపూర్ శాసన సభ్యురాలు సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ అయోధ్య రెడ్డి, టీ శాట్ సీఈఓ వేణుగోపాల్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాధిక్, ప్రజాపక్షం పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ బి. కిరణ్ కుమార్, స్నేహ విద్యాసంస్థల చైర్మన్ వి. సత్యనారాయణ, తెలంగాణ మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి, సిరిసిల్లా జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎల్లారెడ్డి పేట మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్ రెడ్డి, గజ్వేల్ మున్సిపల్ చైర్ పర్సన్ గంగిశెట్టి చందన రవి, ఏఎంసి మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ తదితరులు విరాహత్ అలీని పరామర్శించి ఓదార్చారు.

# టీయూడబ్ల్యూజే కార్యాలయాన్ని సందర్శించిన చండీగఢ్ ప్రెస్ క్లబ్ బృందం



: **హైదరాబాద్** : చండీగఢ్ ప్రెస్ క్లబ్ ఆఫీస్ బేరర్ల బృందం సోమవారం బషీర్ బాగ్ లోని తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ( టీయూడబ్ల్యూజే) కార్యాలయాన్ని సందర్శించింది. చండీగఢ్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దుగ్గల్ నేతృత్వంలోని జర్నలిస్టుల బృందం ఈ సందర్భంగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్, ఐజేయు మాజీ అధ్యక్షుడు కే శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను శ్రీనివాస్ రెడ్డి వారికి వివరించారు. అలాగే జర్నలిస్టుల వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం యూనియన్ చేస్తున్న కృషిని వివరించారు. హైదరాబాద్ కేంద్రంగా యూనియన్ కార్యకలాపాల పనితీరును వారికి వివరించారు. టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో చేపట్టిన పలు కార్యక్రమాల వివరాలను తెలుసుకొని చండీగఢ్ జర్నలిస్టుల బృందం ప్రశంసించింది. వృత్తిపరంగా నిబద్ధత కలిగిన జర్నలిస్టుల సంక్షేమం కోసం చేస్తున్న కృషిని అభినందించింది. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి వారి వెంట ఉన్నారు.

# జడ్జి ఉల్లం అజయ్ కుమార్ కి ఘనంగా వీడ్కోలు

- **పదోన్నతిపై నిజామాబాద్‌కు బదిలీ**
- **సత్కరించిన ఆసిఫాబాద్, సిర్పూర్ న్యాయవాదులు**



: **ఆసిఫాబాద్ టౌన్:** గత మూడు సంవత్సరాలుగా సిర్పూర్ జూనియర్ సివిల్ జడ్జిగా సేవలందించి, పదోన్నతి పై సీనియర్ సివిల్ జడ్జిగా నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయిన ఉల్లం అజయ్ కుమార్ కి సిర్పూర్, ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ జడ్జి ఉల్లం అజయ్ కుమార్ ఎంతో మృదుస్వభావి అని, ఎల్లప్పుడూ చిరునవ్వుతో కనిపిస్తూ, కోపానికి తావులేకుండా విధులు నిర్వర్తించేవారని కొనియాడారు. సమయానుకూలంగా, వృత్తి ధర్మానికి కట్టుబడి పనిచేసిన తీరును ప్రశంసించారు. అనంతరం ఆసిఫాబాద్ జడ్జి అనంత లక్ష్మి , బదిలీపై వెళ్తున్న సిర్పూర్ జడ్జి ఉల్లం అజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పనిచేయడం, ప్రతిభావంతులైన న్యాయవాదులతో కలిసి పనిచేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. మంచి వాతావరణం ఉన్న కోర్టును వదిలి వెళ్లడం బాధగా ఉన్నప్పటికీ, వృత్తి ధర్మంలో భాగంగా బదిలీలు సహజం అన్నారు. న్యాయవాదులు ఎల్లప్పుడూ ఇదే రకమైన ప్రేమాభిమానాలను కొనసాగించాలి అని తెలిపారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీష్ బాబు, న్యాయవాదులు తాటిపెల్లి సురేష్, ముక్త సురేష్, హరీష్ కుడియార్, జై శ్యామ్, రాపర్తి రవీందర్, లాల్చా, రాజు రెడ్డి, చరణ్ తేజ, అరవింద్, హరీష్, అఖిల్, పూజితలతో పాటు న్యాయవాదుల గుమ్మస్తాల సంఘం అధ్యక్షుడు శివ చందు జడ్జి ని శాలువాతో సత్కరించి, పూలగుచ్ఛం, బాలరాముడి విగ్రహాన్ని జ్ఞాపికగా అందించారు.

# మల్లారెడ్డి మృతి రైతాంగ ఉద్యమాలకు తీరని లోటు



: **ఆసిఫాబాద్ టౌన్:** సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకుడు, ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మృతి రైతాంగ ఉద్యమాలకు, వ్యవసాయ రంగానికి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్ అన్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో ఆయన మరణించడంతో స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లారెడ్డికి నీటిపారుదల ప్రాజెక్టులు, భూ సంస్కరణలపై అపారమైన అవగాహన ఉండేదని కొనియాడారు. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో ఉద్యమ విస్తరణకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కుమురం భీం జిల్లాలోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మించాలని మొదట సూచించింది ఆయనేనని, ప్రభుత్వం తుమ్మిడి హెట్టి ప్రాజెక్టును నిర్మిస్తేనే మల్లారెడ్డికి నిజమైన నివాళి అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అశోక్, నాయకులు దుర్గం నిఖిల్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జాడి తిరుపతి, గిరిజన సంఘం నాయకులు కనక సోము తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- **జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్**




: **ఆసిఫాబాద్ టౌన్** : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తుల స్వీకరించారు. జిల్లాలోని సిర్పూర్ – టి మండల కేంద్రానికి చెందిన షకీల్ హుస్సేన్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో క్యాటరింగ్ సప్లై చేసిన దానికి సంబంధించిన బిల్లుల చెల్లింపు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైనూర్ మండలం దూరాతండా గ్రామ ప్రజలు తమ గ్రామ ఆశా కార్యకర్తను తొలగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. రెబ్బెన మండలం గోనేటి గ్రామానికి చెందిన రైతులు తమ ఆర్.ఓ.ఎఫ్.ఆర్. భూములలో బోర్లు వేశారని, విద్యుత్ సరఫరా అందించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ mandalmloni బాబాపూర్ గ్రామానికి చెందిన మసాడె అరుణ్ తన కుమారుడికి గురుకుల విద్యాలయంలో సీటు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దహేగాం మండలం కమ్మరపల్లి గ్రామానికి చెందిన జరుపుల సురేష్ తన తండ్రి పేరిట గల భూమిని తన పేరిట విరాసత్ మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. పెంచికలపేట మండలం గుండెపల్లి గ్రామానికి చెందిన తలండి ముత్తుబాయి తాము సాగు చేస్తున్న ప్రభుత్వం భూమికి తమ పేరిట పట్టా మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఆదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

చురకలు



# బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్

**: ఆసిఫాబాద్ టౌన్:** బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయమైన రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో జిల్లా అడిషనల్ కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణనలో బీసీల సమగ్ర కులగణనను శాస్త్రీయంగా, పారదర్శకంగా నిర్వహించి, బీసీల వాస్తవ జనాభాను కులాల వారీగా అధికారికంగా నమోదు చేయాలని కోరారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం తదితర రంగాల్లో జనాభా నిష్పత్తికి అనుగుణంగా న్యాయం జరగాలంటే ముందుగా వారి ఖచ్చితమైన జనాభా గణాంకాలు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అందువల్ల కులాల వారీగా సమగ్ర జనాభా లెక్కలు సేకరించి, ఆ గణాంకాల ఆధారంగా బీసీ రిజర్వేషన్లను పెంచి, జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. కులగణనలో బీసీ కుటుంబాలన్నీ తప్పనిసరిగా నమోదు అయ్యేలా ప్రత్యేక కేటగిరీ లేదా కాలమ్ ఏర్పాటు చేసి, ఏ కుటుంబం లేదా కులం కూడా లెక్కల్లో మిగిలిపోకుండా శాస్త్రీయ విధానంలో గణన చేపట్టాలని కోరారు. దేశవ్యాప్తంగా సమగ్ర బీసీ కులగణన చేపట్టి ఖచ్చితమైన వివరాలను ప్రకటించాలని, జనాభా ఆధారంగా రిజర్వేషన్లు పెంచి అన్ని రంగాల్లో న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. అలాగే బీసీలకు రాజ్యాంగబద్ధంగా లభించాల్సిన హక్కులను సమర్థవంతంగా అమలు చేస్తూ,




వారి సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్, బీసీ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్న రమేష్, ఆరే సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బొట్టుపల్లి జయరాం, రైతు సంఘం అధ్యక్షులు వైరాగడే మారుతీ, బీసీ యువజన సంఘం ఆసిఫాబాద్ డివిజన్ బొట్టుపల్లి ప్రశాంత్, మున్నూరు కాపు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇందురి తిరుపతి, నాయకులు సిరికొండ సాయి కృష్ణ, దానపల్లి శంరావ్, కుందారపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నోటీసులు పట్ల బిఎల్ఎలు అప్రమత్తంగా ఉండాలి

## బోథ్ వార్డు సభ్యులు షేక్ షాకీర్

**: నేరడిగొండ:** రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా సోమవారం నుంచి అనేక మంది ఓటర్లకు నోటీసులు జారీ కానున్న నేపథ్యంలో ప్రతి ఓటరు, కాంగ్రెస్ పార్టీ బీఎల్ఎలు అప్రమత్తంగా ఉండాలని బోథ్ వార్డు సభ్యులు షేక్ షాకీర్ అన్నారు. ఈ ప్రక్రియలో గుర్తించిన అనామలిస్, అన్మ్యాప్డ్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి వారి వివరాలపై విచారణ నిర్వహిస్తారని తెలిపారు. నోటీసు వచ్చినంత మాత్రాన ఓటు రద్దయినట్లు కాదని, నోటీసును నిర్లక్ష్యం చేయకుండా అందులో పేర్కొన్న తేదీ, సమయం, స్థలాన్ని తప్పకుండా గమనించాలని సూచించారు. నోటీసులో కోరిన పత్రాలు, వివరాలు



సిద్ధంగా ఉంచుకుని సంబంధిత విచారణకు హాజరు కావాలని, ఒకవేళ అర్హత కలిగిన ఓటరు పేరు ఎస్ఐఆర్ డ్రాఫ్ట్ జాబితాలో లేకపోతే క్లెయిమ్స్, ఆబ్జెక్షన్స్ ప్రక్రియలో ఫారం-6 ద్వారా మళ్లీ నమోదు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరిగా నివసించే వారు, వలస వెళ్లి తిరిగి వచ్చిన కుటుంబాలకు నోటీసులు వస్తే వారికి అవసరమైన సమాచారం అందించి, ప్రక్రియను అర్థం చేసుకునేలా కాంగ్రెస్ కార్యకర్తలు సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ బీఎల్ఎలు తమ పరిధిలో నోటీసులు అందుకునే ఓటర్ల వివరాలను గమనించి, నోటీసులో ఉన్న తేదీ, సమయం, విచారణ స్థలాన్ని ఓటరుకు తెలియజేయాలని అన్నారు. అర్హుడైన ప్రతి పౌరుడి ఓటు హక్కు రాజ్యాంగ పరమైన ప్రజాస్వామ్య హక్కును కాపాడాల్సిన బాధ్యత మనదేనని పేర్కొన్నారు.

# వన మహోత్సవ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి

- రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**: ఆదిలాబాద్:** వన మహోత్సవం లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె అటవీ శాఖ ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వన మహోత్సవ్ కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో మంగళవారం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. జిల్లాల వారీగా నిర్దేశిత లక్ష్యాలు, ఇప్పటివరకు నాటిన మొక్కలు, పూర్తి చేయాల్సిన మిగిలిన లక్ష్యం, నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కలు, జియో ట్యాగింగ్ తదితర వివరాలపై ఆరా తీశారు. ప్రస్తుతం రాష్ట్రంలో వర్షాలు కు[illegible] అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లక్ష్యాలకు చేరువ కావాలన్నారు. రేపటి మాస్ ప్లాంటేషన్ కార్యక్రమంలో విద్యార్థులు, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, కార్యాలయాలు, అర్బన్ ఫారెస్ట్ పార్కులు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని ఆదేశించారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని, ప్రతి మొక్కకు రక్షణగా కంచె ఏర్పాటు చేసి తప్పనిసరిగా జియో ట్యాగింగ్ చేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఆదిలాబాద్ కలెక్టరేట్ వీడియో హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. వీసీ ముగిసిన అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ మంగళవారం తలపెట్టిన భారీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. అటవీ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మిగిలిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పెద్ద ఎత్తున కదిలిరావాలని పిలుపు



నిచ్చారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్, ఇచ్చోడ అటవీ అభివృద్ధి అధికారులు విశ్వనాథ్ బుసారెడ్డి, ప్రథమేష్, డీఆర్డీవో రవీందర్, అదనపు డీఆర్డీవో రామ్ప్రసాద్, ఏపీడీ గజానంద్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మండలస్థాయి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి ఆకస్మిక తనిఖీ

**: ఎల్లారెడ్డిపేట:** అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే మండల స్థాయి ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతో పాటు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతుండగా, ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం





నిర్వహించిన ప్రజావాణిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల మండల స్థాయి అధికారుల హాజరును పరిశీలించారు. గత వారం ప్రజావాణికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి.. తదితర అంశాలపై ఆరా తీశారు. చేయూత నూతన పెన్షన్ దరఖాస్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణిలో ఎంపీడీఓ సత్తయ్య, డిప్యూటీ తహశీల్దార్ వేణు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# లింగపాలెంలో ఎర్రా రామయ్య 64వ వర్ధంతి

**: సత్తుపల్లి:** పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన ప్రజానేత, కమ్యూనిస్టు గాంధీగా పేరొందిన ఎర్రా రామయ్య 64వ వర్ధంతిని సోమవారం వేంసూరు మండలం లింగపాలెం గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రామయ్య విగ్రహం వద్ద సంతాప సభ నిర్వహించి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ భూమిలేని పేదలకు సాగు భూములు, దళితులు, బీసీలకు ఇంటి స్థలాలు ఇప్పించేందుకు ఎర్రా రామయ్య చేసిన పోరాటాలు చిరస్మరణీయమన్నారు. కొమ్మేపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నం.132లో సుమారు వంద ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలు సాగు చేసుకునేలా పోరాడి భూములు పంచిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. పేద రైతుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి నిధులు మంజూరు చేయించడం, చెరువులు సాధించడం, భూ సమస్యలపై పోరాడటం వంటి అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. కమ్యూనిస్టు నాయకులకు, సాయుధ దళాలకు సహకరిస్తున్నారనే ఆరోపణలతో పోలీసులు రామయ్యను అరెస్టు చేయగా, గ్రామ ప్రజలు పోలీస్స్టేషన్ను ముట్టడించి ఆయనను విడుదల చేయించుకున్న ఘటనను గుర్తుచేశారు. ప్రజా సమస్యల కోసం నిరంతరం శ్రమించిన ఎర్రా రామయ్య 1962 ఆగస్టు 24న నూజివీడులో ప్రజల పనిమీద కోర్టుకు వెళ్లిన సమయంలో రక్తపోటుతో మృతిచెందారని తెలిపారు. 1963 మార్చి 1న లింగపాలెం గ్రామ నడిబొడ్డున ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించారని, అప్పటి నుంచి ప్రతియేటా వర్ధంతిని నిర్వహిస్తున్నామని చెప్పారు. నేటి పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు రామయ్య జీవితం ఆదర్శమని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన



నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి, సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్రావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చక్రి పద్మ అవార్డు అందుకున్న తాండూర్ చిన్నారులు



**: తాండూర్:** తాండూర్ మండలానికి చెందిన కాంద్ర సాయి తేజస్వి, మనుశ్రీ, ఎల్లాకుల తనశ్విత, అవంతిక, సాయి శివాని, సాత్విక తేజ్ భరత నాట్యంలో అత్యంత ప్రతిభ కనబర్చి శ్రీ చక్రి పద్మ అవార్డును సొంతం చేసుకున్నారు. భద్రాద్రి సాంస్కృతిక వారధి ఆధ్వర్యంలో భువనగిరి జిల్లా శ్రీ స్వర్ణగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన భరతనాట్యంలో అత్యంత ప్రతిభ కనబర్చి అవార్డుతో పాటు ప్రశంస పత్రాన్ని నిర్వాహకులు చల్ల కొండలరావు చేతుల మీదుగా అందుకున్నారు. నాట్య శిక్షకురాలు వల్లభనేని నాగమణి ఆధ్వర్యంలో ఈ చిన్నారులు శిక్షణ పొందుతున్నారు. విద్యా భారతి పాఠశాలకు చెందిన నాట్యాంజలి కార్యక్రమంలో పాల్గొని అవార్డును అందుకున్న విద్యార్థినులను పాఠశాల కరస్పాండెంట్ సురభి శరత్ కుమార్ తో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

# తుంబూరు సొసైటీలో యూరియా పంచాయితీ

**: సత్తుపల్లి:** సత్తుపల్లి మండలం తుంబూరు సొసైటీ వద్ద సోమవారం యూరియా కోసం వచ్చిన రైతులు ఆందోళనకు దిగారు. యూరియా పంపిణీకి సంబంధించిన యాప్ పనిచేయడం లేదని సొసైటీ సిబ్బంది చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కోసం గంటల తరబడి వేచి చూసినా సమస్య పరిష్కారం కాక పోవడంతో రైతులు సొసైటీ గోడౌన్కు తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు తమకు సమాధానం చెప్పాలని సొసైటీ సెక్రటరీని కోరగా, సరైన సమాధానం ఇవ్వలేక అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు రైతులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడి పరిస్థితిని వివరించారు. యాప్లో సాంకేతిక సమస్య ఉన్నప్పటికీ సమీపంలోని ఇతర సొసైటీల్లో యూరియా లభిస్తే అక్కడి నుంచి కూడా రైతులు తీసుకోవచ్చని అధికారులు వివరించారు. అయితే తుంబూరు సొసైటీ పరిధిలోని రైతుల కోసం వచ్చిన యూరియాను ఇతర సొసైటీల రైతులకు పంపిణీ చేయవద్దని కోరుతూ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తమకు అవసరమైన మేరకు యూరియా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

# పీడీఎస్ బియ్యం బ్లాక్ మార్కెటింగ్.. నిందితుడిపై పీడీ యాక్ట్

**: సత్తుపల్లి:** పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్కు తరలిస్తూ ఆర్థిక లాభాలు ఆర్జిస్తున్న నిందితుడిపై పీడీ యాక్ట్ అమలు చేసినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన మీర్జా జిలానీ బేగ్ రేషన్ డీలర్లు, వారి ఏజెంట్ల ద్వారా కార్డుదారులకు అందాల్సిన సబ్సిడీ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆ బియ్యాన్ని అంతర్రాష్ట్రాలకు తరలించి బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నట్లు చెప్పారు. నిందితుడిపై తల్లాడ పోలీస్ స్టేషన్లో పీడీఎస్ బియ్యం అక్రమ కొనుగోలుకు సంబంధించి మొత్తం నాలుగు కేసులు నమోదయ్యాయని తెలిపారు. బీఎన్ఎస్, ఈసిఏ, తెలంగాణ పీడీఎస్ కంట్రోల్ ఆర్డర్కు సంబంధించిన వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వివరించారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ చేయడం, ఇతర ప్రాంతాలకు తరలించడం ద్వారా పేదలకు ఉద్దేశించిన ఆహార భద్రత వ్యవస్థకు తీవ్ర విఘాతం కలుగుతోందని సీపీ పేర్కొన్నారు. అంతేకాకుండా నిత్యావసర వస్తువుల సరఫరా వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు.నిందితుడిపై గతంలో పలుమార్లు కేసులు నమోదవడంతో పాటు, బీఎన్ ఎస్ ఎస్ సెక్షన్ కింద నోటీసులు జారీ చేసినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో పీడీ యాక్ట్ అమలు చేసి వైరా సీఐ వెంకట ప్రసాద్, తల్లాడ ఎస్సై వెంకట కృష్ణ నిందితుడిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్లోని చంచల్గూడ సెంట్రల్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. పేదలకు అందాల్సిన బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, బ్లాక్ మార్కెట్కు తరలించడం వంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

## ట్రాక్టర్ సీజ్.. నిందితుడి రిమాండ్

**: గంభీరావుపేట:** ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్కు తరలించినట్లు పేర్కొన్నారు.




ఈ ఘటన ఈనెల 23న ముస్తఫానగర్ గ్రామ శివారులో చోటు చేసుకుందని, ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ను విచారించగా, నర్మాల గ్రామానికి చెందిన ఒరగంటి ఎల్లయ్యగా గుర్తించారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించడం జరిగిందని తెలిపారు. ట్రాక్టర్, ట్రైలర్తో పాటు ఇసుకను స్వాధీనం చేసుకోవడం జరిందన్నారు. అనంతరం ఎల్లయ్యను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఇసుకను అక్రమంగా తవ్వడం, నిల్వ చేయడం, రవాణా చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**: ఆదిలాబాద్:** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం తాంసి మండలంలోని కప్పర జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేశామని, బాలురు, బాలికల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు, డైనింగ్ హాల్స్, తాగునీటి సదుపాయాలు వంటి పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అత్యుత్తమ వసతులు కల్పించి, వారిని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేర్చడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్లు, డైనింగ్ హాల్స్ వంటి నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ప్యాకేజ్డ్ ఫుడ్స్ పూర్తిగా మానివేయాలని, ఇంటి వద్ద తయారు చేసిన ఆరోగ్యకరమైన భోజనం, మధ్యాహ్న భోజనం, రాగిజావను మాత్రమే తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించేందుకు 'స్పోకెన్ ఇంగ్లీష్' కార్యక్రమాలను మరింత ప్రభావవంతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లోని విద్యార్థుల మధ్య పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబర్చిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన 'ఖాన్ అకాడమీ', 'కోడ్ మిత్ర' వంటి లెర్నింగ్ లాబ్స్, కంప్యూటర్ పీరియడ్స్, లైబ్రరీలను విద్యార్థులు విధిగా సద్వినియోగం చేసుకొని సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపర్చుకోవాలని కోరారు. ప్రతినెలా మూడవ శనివారం నిర్వహించే పేరెంట్–టీచర్ సమావేశాలకు తల్లిదండ్రులు, సర్పంచ్లు, వార్డు సభ్యులు తప్పకుండా హాజరై తమ పిల్లల చదువులు, ప్రోగ్రెస్ రిపోర్ట్లపై ఆరా తీయాలని సూచించారు. విద్యార్థులు ఏ విధమైన ప్రలోభాలకు లోనుకాకుండా కేవలం చదువుపై మాత్రమే దృష్టి సారించాలని, ఉపాధ్యాయుల సహకారంతో లక్ష్యాలను సాధించి తమ పాఠశాలను, జిల్లాను రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో కంప్యూటర్ గది, కిచెన్ గార్డెన్, మరుగుదొడ్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ మాధవి, డీఆర్డీఓ రవీందర్, పంచాయతీ రాజ్ ఈఈ శివరాం, తహశీల్దార్ గణేష్, ఎంపీడీఓ గడ్డం మోహన్ రెడ్డి, ఎంఈఓ శ్రీకాంత్, సర్పంచ్ గంద్రత్ అరుణ్, ఎంపీఓ అవినాష్, హెచ్ఎం ఆనంద్, ఆత్మ చైర్మన్ నారాయణ, ఏఎంసీ చైర్మన్ ఇందిరా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణితోనే సమస్యల పరిష్కారం



**: బెజ్జూర్:** ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని నోడల్ అధికారి బండారు ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 22 గ్రామ పంచాయతీల ప్రజలు తమకు ఉన్న సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందన్నారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 6 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అందులో విద్యుత్ శాఖకు సంబంధించి 3, రెవెన్యూ శాఖకు 2, పంచాయతీరాజ్ శాఖకు 1 ఫిర్యాదు వచ్చాయన్నారు. అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రామ్మోహన్ రావు, సివిల్ సప్లై డీటీ పెద్దిరాజు, ఎంఈఓ సునీత, ఏవో బి.నాగరాజు, పశు వైద్యాధికారి లక్ష్మీనారాయణ, ఏపీఓ రాజన్న, హౌసింగ్ ఏఈ సాయికుమార్, హెల్త్ సూపర్వైజర్ శారద, ఐకేపీ సీసీ బి.భద్రయ్య, ఎఫ్ఎస్ఓ సఫియా బేగం, ఇరిగేషన్ ఏఈఈ శివప్రసాద్, ఐసీడీఎస్ సూపర్వైజర్ అలేఖ్య, మిషన్ భగీరథ సూపర్వైజర్ శంకర్, విద్యుత్ శాఖ ఏఎల్ఎం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**: మంచిర్యాల:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు హరే కృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న అల్పాహారాన్ని పోషక విలువలతో సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో ఉన్న కేంద్రీకృత వంటశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. విద్యార్థులకు ఉదయం వేళలో పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడంతో వారి ఆరోగ్యం, ఏకాగ్రత, విద్యాభ్యాసానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమం నిర్వహణకు హరే కృష్ణ ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. వంటశాలలో పరిశుభ్రత, ఆహార నాణ్యత, తయారీ ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు రూ.23.75 కోట్లతో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు



**: గంభీరావుపేట:** ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తవ్వడం, నిల్వ చేయడం, రవాణా చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై సీహెచ్ శ్రీకాంత్ హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేకంగా నిఘా ఉంచామని తెలిపారు. రాత్రి వేళల్లోనూ పోలీసులు గస్తీ నిర్వహిస్తూ అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేస్తున్నారని పేర్కొన్నారు. సరైన అనుమతులు, పత్రాలు లేకుండా ఇసుకను తరలించే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను గుర్తించిన వెంటనే స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. నదులు, వాగులు, చెరువుల నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తవ్వడం, తరలించడంతో ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడంతో పాటు పర్యావరణానికి హాని జరుగుతుందని తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు సహకరించే వాహన యజమానులు, డ్రైవర్లపై కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**





**: సిరిసిల్ల:** ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 142 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందజేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే దరఖాస్తులు నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగు తుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని సూచించారు. ఐడీఓసీ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డికి విప్లవ జోహార్లు



**: కాగజ్నగర్:** ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం సీపీఎం పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు, రైతాంగ ఉద్యమ నేత కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఆయన ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్తో పాటు తెలంగాణలోనూ నిరంతరం పోరాటాలు సాగించారని గుర్తుచేశారు. నీటిపారుదల ప్రాజెక్టుల చరిత్రను లోతుగా అధ్యయనం చేసి, వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా వ్యవసాయ రంగ అభివృద్ధికి అవసరమైన అంశాలపై మల్లారెడ్డి విశ్లేషణలు చేశారని తెలిపారు. రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, పేదలు, సామాన్య ప్రజల సమస్యలపై ఆయన చేసిన పోరాటాలు చిరస్మరణీయమన్నారు. వర్గ పోరాటాల ద్వారానే సమాజ విముక్తి సాధ్యమని విశ్వసించిన మల్లారెడ్డి తుది శ్వాస వరకు ఎర్రజెండాను భుజాన మోస్తూ ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. ఆయన మరణం రైతాంగ ఉద్యమానికి, సీపీఎం పార్టీకి, ప్రజా సంఘాలకు తీరని లోటని అన్నారు. మల్లారెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని, ఆయన స్ఫూర్తితో ప్రజా సమస్యలపై మరింత బలంగా ఉద్యమిస్తామని నాయకులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు, రైతు సంఘం నాయకులు కుశల రాజన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ముంజం ఆనంద్కుమార్, వికలాంగుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు పండుగ రాజేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిషేధిత జాబితా నుంచి రైతుల భూములను తొలగించాలి

**మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప**



**: బెజ్జూర్:** మండలంలోని పలువురు రైతుల భూములు 22ఏ నిషేధిత జాబితాలో చేరడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి అర్హులైన రైతుల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సోమవారం బెజ్జూర్ మండల కేంద్రంలో 22ఏ భూముల అంశంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోనప్ప మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రైతులు సాగు చేసుకుంటున్న, పూర్తి పట్టాలు కలిగిన భూములను సైతం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం అన్యాయమన్నారు. దీంతో రైతులు తమ భూములను క్రయ విక్రయాలు చేయలేకపోవడంతో పాటు బ్యాంకుల్లో రుణాల కోసం తనఖా పెట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు రైతులు తనను కలిసి తమ సమస్యలను వివరించారని, అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. తన సొంత భూమిని సైతం 55 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నప్పటికీ 22ఏ జాబితాలో చేర్చారని తెలిపారు. రైతుల వద్ద ఉన్న పట్టాలు, హక్కులు, సాగు ఆధారాలను సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారి భూములను వెంటనే నిషేధిత జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రైతులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రైతుబంధు, రైతుబీమా, యూరియా తదితర అంశాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. 22ఏ నిషేధిత జాబితా సమస్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా ప్రత్యేకంగా పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బెజ్జూర్ మండల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ యూరియా నిల్వలపై దాడులు చేయాలి

- **యాప్లను రద్దు చేసి పాత పద్ధతిలోనే యూరియా సరఫరా చేయాలి**




**: సత్తుపల్లి:** అక్రమంగా యూరియాను నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్న అక్రమార్కులపై అధికారులు దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం వేంసూరు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో రైతులతో కలిసి నిర్వహించిన ధర్నాలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన యాప్లను రద్దు చేసి పాత పద్ధతిలోనే రైతులకు యూరియా సరఫరా చేయాలని కోరారు. యాప్ల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమయానికి యూరియా అందక పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా అవసరమైన సమయంలో రైతులకు అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్రావు, రైతు సంఘం నాయకులు మోరంపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండు యాప్లతో పాటు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్లోనూ యూరియా బుకింగ్ కావడం లేదని తెలిపారు. యాప్లు పనిచేయని సమయంలో సహకార సంఘాల ద్వారా ఆఫ్లైన్లో యూరియాను రైతులకు అందించి ఆదుకోవాలని కోరారు. వివిధ యాప్లలో యూరియాను బుక్ చేసుకుని కొందరు అక్రమంగా నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వస్తోందని నాయకులు తెలిపారు. విజిలెన్స్ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమ నిల్వలను గుర్తించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైనంత యూరియాను సకాలంలో అందించేందుకు ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టాలని కోరారు.

# సెప్టెంబర్ 1లోగా తల్లాడ రైతులకు సాగునీరు ఇవ్వాలి

- **లేనియెడల ఇరిగేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం**
- **మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య**

: **సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా తల్లాడ మండల రైతులకు సెప్టెంబర్ 1లోగా సిరిపురం మేజర్ కాలువ ద్వారా సీతారామ సాగర్ జలాలను అందించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. అధికారులు ఇచ్చిన హామీని అమలు చేయకపోతే రైతాంగంతో కలిసి ఇరిగేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చ రించారు. సోమవారం తల్లాడ మండలం అన్నారు గూడెంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టు రూపకల్పన, నిర్మా ణంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి కీలకమని పేర్కొన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఖమ్మం జిల్లా సాగునీటి అవస రాలను తీర్చేందుకు సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ సుమారు రూ.10వేల కోట్లు ఖర్చు చేసి భూసేకరణ, మోటార్లు, పంప్హౌస్లు, సబ్స్టేషన్ల నిర్మాణం వంటి కీలక పనులు చేపట్టారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 30 నెలల్లో కేవలం రూ.10వేల కోట్ల మేర మాత్రమే ఖర్చు చేయడంతో ప్రాజెక్టు పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని ఆరోపించారు. గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రధాన పనులు చేప ట్టకపోతే ప్రస్తుతం నిర్మించిన రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా నీటిని తరలించే పరిస్థితి ఉండేది కాదన్నారు. రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా నీరు అందుతున్నప్పటికీ తల్లాడ మండల రైతులకు సాగునీరు అందక పోవడం బాధాకరమని అన్నారు. సిరిపురం మేజర్ కాలువ ద్వారా తల్లాడ మండలంలోని సుమారు 11,500 ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బం దులు పడుతున్నారని విమర్శించారు. అధికారుల తీరుకు నిరసనగా రైతులతో కలిసి ఆందోళన చేపట్టాలని నిర్ణయించిన సమయంలో కొత్తగూడెం సీఈతో మాట్లాడగా, సెప్టెంబర్ 1లోగా సిరిపురం మేజర్ కాలువ ద్వారా



తల్లాడ మండలానికి సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన హామీని అధికారులు తప్పక నిలబెట్టుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 1లోగా నీరు అందించకపోతే సెప్టెంబర్ 2, లేనియెడల 3వ తేదీన తల్లాడ మండల రైతాంగంతో కలిసి ఇరిగేషన్ కార్యాల యాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సెప్టెంబర్ 2న తల్లాడ మండల కేంద్రంలో నిర్వహించే నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఉద్యోగులు, ఎన్జీవోలు, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు తమ హక్కులు, ప్రయోజనాల కోసం నిర్వహించే ఆందోళన కార్యక్రమాలకు సత్తుపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు మద్దతుగా నిలవాలని సండ్ర కోరారు. "తల్లాడ మండల రైతులకు సెప్టెంబర్ 1లోగా సిరిపురం మేజర్ కాలువ ద్వారా సీతారామ సాగర్ జలాలు అందించాలని, అధికారులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే రైతాంగంతో కలిసి ఇరిగేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని స్పష్టం చేశారు.

# వనమహోత్సవం లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి

- **సెప్టెంబర్ చివరి వారంలోగా వంద శాతం మొక్కలు నాటాలి**
- **రాష్ట్ర మంత్రి కొండా సురేఖ**

: **మంచిర్యాల:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా వంద శాతం పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వినయ్కుమార్తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వనమహోత్సవం లక్ష్యసాధనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 56 శాతం లక్ష్యాలను పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాలను సెప్టెంబర్ చివరి వారంలోగా పూర్తి చేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా కొంత ఆలస్యం జరిగిందని, ఇకపై కురిసే వర్షపు నీటిని సద్వినియోగం చేసుకుని విస్తృతంగా మొక్కలు నాటాలని అన్నారు. మొక్కలు నాటడమే



కాకుండా వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రతి మొక్క బతికేలా చూడాలని సూచించారు. అటవీ శాఖ నర్సరీల్లో తగినన్ని మొక్కలు అందుబాటులో ఉన్నందున గుర్తించిన ప్రాంతాలకు అనుగుణంగా ఎంపిక చేసిన మొక్కలను నాటాలని మంత్రి తెలిపారు. పశువులు, జంతువుల నుంచి మొక్కలను రక్షించేందుకు ట్రీగార్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అర్బన్ ఫారెస్ట్లలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి మొక్కలు పంపిణీ చేయాలని ఆదేశించారు. దేవాలయాల ప్రాంగణాల్లో ప్రత్యేకంగా ఎంపిక చేసిన మొక్కలను నాటేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకో వాలని, వనమహోత్సవంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు మీడియా ద్వారా ప్రచారం చేయాలని



తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో వనమహోత్సవంలో భాగంగా 41లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 27 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. నిర్ణీత గడువులోగా వంద శాతం లక్ష్యాన్ని సాధించేలా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు తీసు కుంటున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 27, గ్రామ, వార్డు సభలు నిర్వహించాలి

- **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

: **మంచిర్యాల:** ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 27న రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు నిర్వ హించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు.గ్రామ, వార్డు సభల్లో ముసాయిదా ఓటర్ల జాబితా, ఏఎస్డీ (ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్) జాబితాలను ప్రజలకు చదివి వినిపించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఫారం–6, 7, 8లను అందుబాటులో ఉంచుకుని ప్రజల అభ్యంతరాలను నమోదు చేయాలని తెలిపారు. అనామోలీస్, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను



గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని, పెండింగ్ నోటీసుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో అనామోలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు సంబంధించిన నోటీసుల జనరేషన్ దాదాపు పూర్తయిందని తెలిపారు. సంబంధిత ఓటర్లకు మూడు



రోజుల్లో నోటీసులు అందిస్తామని, 27న గ్రామ, వార్డు సభలను నిర్ణీత కార్యాచరణ ప్రకారం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ఆర్డీఓ శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, తహశీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్షాళనలో వేంసూరు మండలానికి ప్రథమ స్థానం

- **వంద శాతం ఎన్యూమరేషన్.. 98 శాతం మ్యాపింగ్ పూర్తి**

: **సత్తుపల్లి:** ఓటర్ల జాబితా ప్రక్షాళన, నిజమైన ఓటర్ల నిర్ధారణ కోసం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో వేంసూరు మండలం రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని తహశీల్దార్ జె.మాణిక్రావు తెలిపారు. మండలంలో వంద శాతం ఎన్యూ మరేషన్, 98 శాతం మ్యాపింగ్ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం వేంసూరు మండల కేంద్రంలోని రైతువేదిక సమావేశ మందిరంలో బీఎల్ఓలు, సూపర్వైజర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బీఎల్ఓలు, సూపర్వైజర్లు చేసిన కృషిని అభినందించారు. అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి సంపత్కుమార్ సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఎంపీడీఓ దార్ల కావ్య మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు, ఇతర శాఖల ఉద్యోగులు కుటుంబాలను సైతం పక్కన పెట్టి రేయింబవళ్లు కష్టపడి విధులు నిర్వర్తించారని కొనియాడారు. అనంతరం ఐదు బృందాలుగా పనిచేసిన 46 మంది బీఎల్ఓలు, ఐదుగురు సూపర్వైజర్లు, ఇద్దరు మాస్టర్ ట్రైనర్లు, డీఎస్ఓ సంపత్కుమార్, అసిస్టెంట్గా పనిచేసిన అజయ్ సహా మొత్తం 55 మందిని నాయబ్ తహశీల్దార్ గూగులోతు లక్ష్మణ్ తన వ్యక్తిగత ఖర్చులతో శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. మండలంలో 543 మంది ఓటర్లు మ్యాపింగ్ కాకపోగా, 1,487 మంది ఎన్యూమరేషన్ పూర్తి కానివారుగా ఉన్నారని, మొత్తంగా 2,030 మంది మాత్రమే పూర్తిస్థాయి ఓటర్లుగా గుర్తింపు పొందలేదని లక్ష్మణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ భూక్యా రంజిత్కుమార్, మాస్టర్ ట్రైనర్లు జల్లిపల్లి మురళీమోహన్, చెన్నకేశవరెడ్డి, సూపర్వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటడం ప్రతిఒక్కరి బాధ్యత

: **సిర్పూర్(యు):** మొక్కలను నాటడంతో పాటు వాటిని పరి రక్షించడం ప్రతిఒక్కరి బాధ్యత అని రాగాపూర్ సర్పంచ్ ఆత్రం బీర్చావు అన్నారు. సోమవారం రాగాపూర్ లో మొక్కలు నాటడంతో పాటు పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామ అభివృద్ధి, పరిశుభ్రత కోసం గ్రామ ప్రజలందరూ కలిసి పనిచేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చాహకటి లక్ష్మణ్, టీపీ



దశరథ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పటేల్ కోవా విజయ్ కుమార్, నాందేవ్, ప్రభాకర్, కారోబారి చిత్రం రాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ అధికారిపై దాడి.. కేసు నమోదు

: **కౌటాల:** మండలంలోని కనికి గ్రామంలో ముత్యంపేట సెక్షన్ ఆఫీసర్గా విధులు నిర్వహిస్తున్న ఎండి అత్తరుద్దీన్పై విధి నిర్వహణలో భాగంగా సోమవారం దేవరకొండ శ్రీనివాస్ అనే వ్యక్తి దాడి చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

# 27న చలో కలెక్టరేట్ ధర్నా విజయవంతం చేయాలి



: **కౌటాల:** ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 27న జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం కౌటాల మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నాకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రెండో పీఆర్సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని, ఆరు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ను రద్దు చేసి ఓపీఎస్ను పునరుద్ధరించాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని, వర్క్ అడ్జస్ట్మెంట్కు సంబంధించిన జీవో 25ను రద్దు చేయాలని కోరారు. పర్యవేక్షణ అధికారుల నియా మకానికి సర్వీస్ రూల్స్ రూపొందించాలని, హెల్త్ కార్డుల పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన 64 సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోడం నానాజీ, శ్రీనివాస్, రావుల వినోద్, టీఎస్యూటీఎఫ్ నాయకులు రవికుమార్, శైలజ, రాకేష్, పీఆర్టీయూ నాయకులు శివాజీ, సునీల్, ఎస్టీయూ నాయకులు ధర్మయ్య, చంద్ర మౌళి, శ్రవణ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన బోరంచు

: **ఆదిలాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ రేషన్



కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని దస్నాపూర్, దోబీకాలనీ, కేఆర్కే కాలనీ, పిట్టలవాడ కాలనీలకు చెందిన 4వ నంబర్ రేషన్ దుకాణం కార్డుదారులకు ఆదిలాబాద్ ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్రెడ్డి కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పారదర్శకంగా, ఎలాంటి జాప్యం లేకుండా అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు తెలిపారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ నాంపల్లి వేణుగోపాల్, అలీమ్, రేండ్ల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆత్రం సుగుణ పరామర్శ

: **జైనూర్:** మండలంలోని పవర్గూడ గ్రామానికి చెందిన గేడం సావిత్రబాయి ఇటీవల మృతి చెందగా, సోమవారం కుమురంభీమ్ ఆసిఫాబాద్ డీసీసీ



అధ్యక్షురాలు ఆత్రం సుగుణ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, సావిత్రబాయి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆమె వెంట సర్పంచ్ తొడసం రాజేందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షేక్ రషీద్, జిల్లా కార్యవర్గ సభ్యులు పెందోర్ ప్రకాష్, సర్పంచ్ సంఘం అధ్యక్షుడు మాడవి మనోహర్, రాసిమెట సర్పంచ్ ఉయిక చందన్ శావ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ రహీం, షేక్ ఇస్లాం, తొడసం గంగారం పటేల్, అనక రాంజీ, గేడం మారు, తొడసం మాణిక్ రావ్, కుంరం మారుతీ, మాజీ ఎంపీపీ అనక కలబాయి, మేశ్రం లక్ష్మి బాయి, గేడం పూర్ణబాయి తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ సభ్యుల సంఘటితం తోనే అభివృద్ధి సాధ్యం

- అధ్యక్షులు భీమిడి వెంకటరెడ్డి
- లెక్చరర్స్ కాలనీ నివాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా భీమిడి వెంకటరెడ్డి ఎన్నిక




**హయత్ నగర్, ఆగస్టు 24, వార్తా ప్రవాహం న్యూస్:** లెక్చరర్స్ కాలనీ నివాసితుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ నెల 17వ తేదీన నిర్వహించిన ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన భీమిడి వెంకటరెడ్డితో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సంఘం ఉపాధ్యక్షులుగా నర్సిరెడ్డి, బాలరాజు గౌడ్, ప్రధాన కార్యదర్శిగా నరసింహ గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా సుధాకర్ గౌడ్, నరసింహారెడ్డి, ప్రచార కార్యదర్శిగా సంతోష్ కుమార్ రెడ్డి, కోశాధికారిగా లింగయ్య గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు భీమిడి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు ఏకగ్రీవం కావడానికి సహకరించిన కాలనీ వాసులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలోని సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా, ప్రశాంతంగా నిర్వహించిన ఎన్నికల కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల కమిటీ సభ్యులు బుచ్చిరెడ్డి, సుధాకర్ రావు, నరసింహ చారి, యాదవ రెడ్డితో పాటు కాలనీ నివాసితులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి డివిజన్ అధ్యక్షుడిగా మొరిగేషన్ వేలు నియామకం

**శేరిలింగంపల్లి,:**



తెలంగాణ రక్షణ సేన "టీఆర్ఎస్" శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని 227- శేరిలింగంపల్లి డివిజన్ అధ్యక్షుడిగా మొరిగేషన్ వేలు నియమితులయ్యారు. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు, శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ఈ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, క్రియాశీల కార్యకర్తగా పార్టీ బలోపేతానికి కృషి చేసినందుకు గుర్తింపుగా వేలుకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. నూతనంగా నియమితులైన వేలు పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ఆకాంక్షించారు.

# దత్తాత్రేయ కాలనీలో కొండపాక దంపతుల నూతన గృహప్రవేశం



**ఎల్లమ్మబండ,:**

దత్తాత్రేయ కాలనీ, ఎల్లమ్మబండలో నూతనంగా నిర్మించుకున్న ఇంటి గృహప్రవేశాన్ని కొండపాక ఇస్సాక్ - కొండపాక భవానీ దంపతులు ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కాలనీ పెద్దలు, బంధువులు హాజరయ్యారు. అనంతరం మిత్రులు ముత్యాల యాదగిరి, పరమేష్ సాగర్ , సదా రాజ్ కుమార్, బరిగే నరేష్, శ్రీనివాస్ రెడ్డి, రవిరాజ్, అనిల్, బాలు, సురేందర్ తదితరులు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజారోగ్యంతో చెలగాటం.. పాలేరు డివిజన్ లో అడ్డగోలుగా ఫుడ్ సెంటర్లు

**లైసెన్సుల్లేవ్.. తనిఖీలూ లేవ్.. అధికారుల అండదండలతో యథేచ్ఛగా దందా**

**ఖమ్మం :**పాలేరు డివిజన్ వ్యాప్తంగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నేలకొండపల్లి, కూసుమంచి మండలాల్లో ఎలాంటి ఫుడ్ లైసెన్సు లేకుండానే ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, బిర్యానీ సెంటర్లు, చికెన్ దుకాణాలు యథేచ్ఛగా వెలిశాయి.

**అసలు విషయం ఏంటంటే...**

ఏ ఒక్క షాపుకు FSSAI ఫుడ్ లైసెన్సు లేదు.చికెన్ కొట్లలో కుళ్లిన మాంసాన్ని రంగు, వాసన కోసం రసాయనాలు కలిపి అమ్ముతున్నారు. ఫ్రిజ్ లలో నిల్వ ఉంచిన చికెన్ ను రెండు, మూడు రోజుల తర్వాత కూడా వండి అమ్మేస్తున్నారు. పరిశుభ్రత అసలే లేదు. చెత్తాచెదారం మధ్యనే వంటలు చేస్తున్నారు. ఫ్యామిలీ ధాబా పేరుతో బార్ లను నడుపుతూ బహిరంగంగా మద్యం పోస్తున్నారు.

**ఎక్కడ నిద్రపోతున్నారు ఫుడ్ ఇన్స్పెక్టర్లు?**

జిల్లాలో ఫుడ్ ఇన్స్పెక్టర్లు ఉన్నారా? ఉంటే ఏం చేస్తున్నారు? అనేది ప్రజల ప్రశ్న. నెలల తరబడి ఒక్క తనిఖీ కూడా చేయకపోవడంతో వ్యాపారులకు అధికారుల భయం లేకుండా పోయింది. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోకపోవడం వెనుక మతలబు ఏమైనా ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి స్పందించి, పాలేరు డివిజన్ లోని అక్రమ ఫుడ్ సెంటర్లపై ఆకస్మిక దాడులు నిర్వహించి, లైసెన్సు లేని దుకాణాలను సీజ్ చేసి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



# నేలకొండపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**ఖమ్మం :**

నేలకొండపల్లి, నేలకొండపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.గ్రామ సర్పంచ్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీవో ఎర్రయ్య, ఏఎంసీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.కొత్త స్మార్ట్ కార్డులతో రేషన్ పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని అతిథులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేష్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



**అదనపు కలెక్టర్ విక్టర్**

**కామారెడ్డి, :**సోమవారం65 ఫిర్యాదులు స్వీకరించిన అదనపు కలెక్టర్ విక్టర్ ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 65 ఫిర్యాదులు అందాయి. ప్రజలు తమ సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, సంబంధిత శాఖల అధికారులకు వాటిని పంపించి నిబంధనల ప్రకారం పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సూచించారు.ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా పరిశీలించి, అర్హత ఉన్న సమస్యలను నిర్ణీత గడువులోగాపరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు, భూ సంబంధిత సమస్యలు తదితర అంశాలపై అవసరమైన సహకారం అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్ వై గిరి, సీఈఓ చందర్, డిఆర్ఓ పాండు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో భూముల రీ సర్వే పనులను వేగవంతం చేయాలి

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తీవరి**

**వికారాబాద్, :**సోమవారం జిల్లాలో చేపడుతున్న రీ సర్వే పనుల పురోగతిపై వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తీవరి అధ్యక్షతన తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలాల వారీగా రీ సర్వే ప్రక్రియ, భూ రికార్డుల పరిశీలన, సర్వే పనుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రీ సర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్లు తమ మండలాల పరిధిలో రీ సర్వే పనుల ప్రస్తుత స్థితిగతులను, పెండింగ్ అంశాలను కలెక్టర్‌కు వివరించారు. సర్వే ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటిస్తూ భూ రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామ సభలు నిర్వహించి రీ సర్వే పనులను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటా చారి, డి ఆర్ ఓ స్వర్ణ లత, ఆర్ డి ఓ వాసు చంద్ర, డిప్యూటీ కలెక్టర్ పూజ ,ఏ డి సర్వ్ ల్యాండ్ మధుసూదన్, అన్ని మండలాల తహసిల్దార్లు, సంబంధిత రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# చెరువుమాదారంలో ఘనంగా బీజేపీ గ్రామ శాఖ సమావేశం



**ఖమ్మం :**

నేలకొండపల్లి మండలం చెరువుమాదారం గ్రామంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) గ్రామ శాఖ సమావేశం ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన కొండా హర్షవర్ధన్ నివాసం వద్ద ఈ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్, మండల ఉపాధ్యక్షులు పురాణం దివాకర్, మండల అధికార ప్రతినిధి సూరేపల్లి జ్ఞానరత్నం హాజరై ప్రసంగించారు.గ్రామ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలని, ప్రజా సమస్యలపై నిరంతరం అందుబాటులో ఉండాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు గెల్లా చక్రపాణి, ఏపూరి సత్యనారాయణ, జెల్లా సురేష్ తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాదాపూర్ అన్ అకాడమీ ఫ్రెషర్స్ డే వేడుకల్లో రవికుమార్ యాదవ్

**మాదాపూర్,:** మాదాపూర్ అన్ అకాడమీ కళాశాల ఆధ్వర్యంలో ఆశ్రయ్ కన్వెన్షన్‌లో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్, మాజీ ఏపీ డీజీపీ నండూరి సాంబశివరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం జెన్-జీ యుగం నడుస్తోందని, దానికి అనుగుణంగా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. కఠిన సవాళ్లు ఎదురైనప్పుడే మన సామర్థ్యం బయటపడుతుందని, ఏఐ, సోషల్ మీడియాను అవసరం మేరకే వాడాలని సూచించారు. ఫోన్ వాడండి కానీ దానికి బానిస కావద్దని తెలిపారు. విద్యార్థులు కేవలం మార్కులపైనే కాకుండా మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోవాలని, టెక్నాలజీని తెలివిగా ఉపయోగిస్తూ కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఆసక్తితో ఉండాలని సూచించారు. మీ మొదటి అధ్యాయం ముగిసింది, అసలైన ప్రయాణం ఇప్పుడే మొదలైందని, కలలను నెరవేర్చుకోవడానికి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్-చైర్మన్ రమణ భూపతి, డైరెక్టర్లు కృష్ణ, సీతా రామాంజనేయులు, నోపాధ్యాయులు అశోక్ రెడ్డి, సాహిల్, శాంతి, జలదుర్గం, జనార్ధన్ రావు, లక్ష్మీ నారాయణ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



# పాలు తాగని దేశాలు ఏవో తెలుసా..ఎందుకంటే?



పాలల్లో సహజంగా లాక్టోజ్ అనే పదార్థం ఉంటుంది. పాల ఉత్పత్తుల్లో ఉండేది చక్కెర లాంటి పదార్థం. ఇది శరీరంలో సులభంగా జీర్ణం కాదు. దీన్నే లాక్టోజ్ టాలరెన్స్ అంటారు. అయితే పాల ఉత్పత్తులకు దూరంగా ఓ పది దేశాలు ఉన్నాయి. దక్షిణ కొరియా దేశంలో పాలకు బదులు సోయా లాంటి లాక్టోజ్ ఉత్పత్తులు వాడతారు. సోలమన్ దీవుల్లో కూడా పాలు తాగరు. వియత్నాంలో మొక్కల ద్వారా లభించే పాల పదార్థాలు తీసుకుంటారు. ఇరాన్, ఒమన్, సిరియా, ఇజ్రాయిల్, ఉజ్బెకిస్తాన్, ఇరాక్, సోమాలియాలో పాలను దాదాపు 95 శాతం మంది తాగరు. కానీ సహజ సిద్ధంగా మొక్కల ద్వారా వచ్చే లాక్టోజ్ పదార్థాలను తీసుకుంటారు.




# బ్లాక్ వాటర్ గురించి తెలుసా..?



టీం ఇండియా క్రికెటర్ విరాట్ కోహ్లీ ని ఫిట్ నెస్ రారాజు అని పిలుచుకుంటారు. అతడు చేసే వర్కౌట్ వీడియోలను సోషల్ మీడియాలో చాలా మంది గమనిస్తుంటారు.

కాగా విరాట్ చాలా వరకు డైట్ పాటిస్తారు. ఫిట్ నెస్ కోసం విరాట్ నాన్ వెజ్ తినడం మానేశారు. కాగా విరాట్ కోహ్లీ బ్లాక్ వాటర్ తాగుతుంటాడు. చాలా మందికి నీటికి రంగు రుచి ఉండదనే తెలుసు. మరి బ్లాక్ వాటర్ సంగతేంటి అనుకుంటున్నారా.. ఈ బ్లాక్ వాటర్ వల్ల శరీరానికి ఎన్నో ఉపయోగాలు ఉంటాయి. దీని ధర కూడా అంతే స్థాయిలో ఉంటుంది. లీటర్ బ్లాక్ వాటర్ ధర సుమారు రూ. 600 నుంచి రూ. 3 వేల దాకా ఉంటుంది. కోహ్లీ తో పాటు బాలీవుడ్ హీరోయిన్లు ఊర్వశి రౌటేలా, మలైకా అరోడా, శ్రుతిహసన్ కూడా తాగుతున్నారు. ఈ నీళ్లు నల్ల రంగులో ఉంటాయి. సాధారణ నీటితో పోలిస్తే బ్లాక్ వాటర్ pH స్థాయి ఎక్కువగా ఉంటుంది. ఈ బ్లాక్ వాటర్ pH స్థాయి మాత్రం 8.5 ఉంటుంది. సాధారణ నీళ్లలో కేవలం 6 నుంచి ఏడు వరకు మాత్రమే పీహెచ్ ఉంటుంది. ఇక ఈ బ్లాక్ వాటర్‌లో 70కి పైగా మినరల్స్ ఉంటాయి. ఇది దీర్ఘకాలంలో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తాయి. ఈ బ్లాక్ వాటర్‌లోని అణువులు చిన్నగా ఉంటాయి. దీంతో వీటిని మన శరీర కణాలు సులువుగా శోషిస్తాయి. అంతేకాదు ఈ బ్లాక్ వాటర్ అణువులు మన శరీర వ్యవస్థకు మనం అందించే పోషకాలను నిలుపుకోవడంలోనూ ప్రత్యేకంగా పని చేస్తాయి. కాగా ఇది ఫ్రాన్స్ లో తయారు చేస్తారని దీనిని టాప్ మోస్ట్ సెలబ్రేటీలు మాత్రమే తాగుతారని తెలుస్తోంది.

# అల్యూమినియం పాత్రల్లో వంట చేస్తున్నారా.. అయితే మీరు ప్రమాదంలో పడ్డట్లే!

ప్రస్తుత సమాజంలో అల్యూమినియం పాత్రల్లోనే అందరూ వంటలు చేసుకుంటారు. కానీ ఇందులో వంట చేసుకోవడం చాలా డేంజర్ అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా అల్యూమినియం పాత్రలు మరీ డేంజర్. ఎందుకంటే..యాసిడ్స్ కలిగిన పదార్థాలు, టమాటాలు, అలాగే పుల్లని పదార్థాలు కోసం అల్యూమినియం పాత్రలను వాడినపుడు చర్య జరిపి.. వీటి నుంచి ఎక్కువ శాతం అల్యూమినియం పదార్థాలలో కలిసి పోయే ప్రమాదం ఉంటుంది. పరిశోధనల ప్రకారం తెలిసింది ఏంటంటే.. ఒకవేళ మనం ఇంట్లో అల్యూమినియం వస్తువులను వాడాల్సి వచ్చినపుడు వాటిలో ఎక్కువ సమయం పులుపు, యాసిడ్ కలిగిన పదార్థాలు నిల్వ ఉంచకూడదు. ఎక్కువ సమయం వేడి చేయకుండా వాడుకోవాలి. అయితే కూరలు క్రోమియమ్, లెడ్, కాడ్మియమ్, నికిల్ వంటి మిగిలిన వస్తువులలో కంటె అల్యూమినియంలో ఉడికించేటప్పుడు మూడింతలు ఎక్కువ కరిగి పదార్థాలతో కలిసే అవకాశం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు అల్యూమినియం పాత్రల్లో వంట చేయటం వల్ల, బ్రెయిన్‌లోని క్రోమాటిక్ నెట్ వర్క్ పైన ప్రభావం పడి , బ్రెయిన్ సెల్స్ డామేజ్ అయ్యే అవకాశం ఉందని వైద్య పరిశోధనల్లో రుజువైంది. అల్యూమినియం చేసే హాని నుంచి బయటపడాలంటే ఎనొడైజ్డ్ అల్యూమినియం పాత్రలను వాడుకోవాలి. ఈ ఎనొడైజ్డ్ మెటల్‌తో తయారు చేసిన పాత్రలు, పాన్‌లు కూడా త్వరగా వేడెక్కడమే కాక, మన్నిక కూడా ఎక్కువకాలం ఉంటుంది. దానితో పాటు గీతలు పడకుండా, శుభ్రం చేసుకునేందుకు కూడా సులువుగా ఉంటాయి. ఈ ఎనొడైజ్డ్ అల్యూమినియం పాత్రలలో పదార్థాలు వండటం వల్ల అల్యూమినియం పదార్థాలలో కలిసే ప్రమాదం అంతగా లేదని పరిశోధకులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే బాగా బాయిల్ చేసి వండే ఏ వంటకాన్నైనా అల్యూమినియం పాత్రల్ని వాడకపోవటమే మంచిదంటున్నారు.



# కొలంబో టెస్టుకు వరుణుడి బ్రేక్

- భారత ఇన్నింగ్స్‌కు వర్షం అంతరాయం
- ఆట నిలిచేసరికి భారత్ 475/8
- 95 పరుగులతో శతకానికి చేరువలో ధ్రువ్ జురెల్
- రిషభ్ పంత్ మెరుపులు.. 63 పరుగులతో కీలక ఇన్నింగ్స్



**కొలంబో:** భారత్–శ్రీలంక రెండో టెస్టుకు వరుణుడు అడ్డుపడ్డాడు. రెండో రోజు టీ విరామానికి ముందే ఆకాశం మేఘావృతమై కొద్దిసేపటికే వర్షం మొదలైంది. దీంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు. అప్పటికి భారత్ ఎనిమిది వికెట్ల నష్టానికి 475 పరుగులతో భారీ స్కోరు సాధించింది. ధ్రువ్ జురెల్ 95 పరుగులతో అజేయంగా నిలిచి శతకానికి




చేరువయ్యాడు. ఓవర్‌నైట్ స్కోరు 300/5తో రెండో రోజు ఆట ప్రారంభించిన భారత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. అరంగేట్ర ఆటగాడు సరాన్ష్ జైన్ 6 పరుగులకే వెనుదిరిగాడు. తొలి రోజు రిటైర్డ్ హర్ట్‌గా మైదానాన్ని వీడిన రిషభ్ పంత్ తిరిగి క్రీజులోకి వచ్చి తనదైన శైలిలో శ్రీలంక బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ధ్రువ్ జురెల్‌తో కలిసి కీలక భాగస్వామ్యాన్ని నిర్మించాడు. పంత్ టెస్టుల్లో తన 21వ అర్ధశతకాన్ని నమోదు చేసి 63 పరుగులతో ఔటయ్యాడు. మరోవైపు జురెల్ నిలకడగా ఆడుతూ ప్రభాత్ జయసూర్య బౌలింగ్‌లో బౌండరీతో అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. టెస్టుల్లో జురెల్‌కు ఇది మూడో అర్ధశతకం. పంత్–జురెల్ జోడీ శతక భాగస్వామ్యంతో భారత్‌ను భారీ స్కోరు దిశగా నడిపించింది. లంచ్ సమయానికి భారత్ ఆరు వికెట్లకు 419 పరుగులు చేసింది. భోజన విరామం అనంతరం తొలి బంతికే పంత్ వెనుదిరిగినా జురెల్ మాత్రం పట్టువదల్లేదు. మానవ్ సుతార్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. అసిత ఫెర్నాండో బౌలింగ్‌లో బౌండరీ సాధించి 95 పరుగులకు చేరుకున్న జురెల్ తొలి టెస్టు శతకానికి కేవలం ఐదు పరుగుల దూరంలో నిలిచాడు. అదే సమయంలో కొలంబోలో మబ్బులు దట్టంగా కమ్ముకోవడంతో అంపైర్లు టీ విరామాన్ని ముందుగానే ప్రకటించారు. అనంతరం వర్షం మొదలవడంతో ఆటకు అంతరాయం ఏర్పడింది. జురెల్ శతకం పూర్తి చేసిన తర్వాత భారత్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసే అవకాశముండటంతో ఆట పునఃప్రారంభంపై ఆసక్తి నెలకొంది.



# అమ్మాయిలదీ అదే కథ

**అమ్‌స్టెల్వీన్:** హాకీ ప్రనపంచకప్‌లో భారత మహిళల జట్టు ప్రస్థానం ముగిసింది. నెదర్లాండ్స్ చేతిలో పురుషుల జట్టు ఓటమి బాధ మరువక ముందే అమ్మాయిల పోరాటమూ రెండో దశలోనే ఆగిపోయింది. పూల్ 'ఈ'లో భాగంగా ఆడిన మూడు మ్యాచుల్లో రెండు డ్రా చేసుకుని ఒకదాంట్లో ఓడిన సలీమ సేన.. ఆదివారం ఆస్ట్రేలియాతో గేమ్‌నూ డ్రాగానే ముగించింది. ఈ మ్యాచ్‌లో గెలిచి సెమీస్‌కు చేరాలన్న 52 ఏండ్ల నిరీక్షణకు తెరదించాలని యత్నించిన భారత్‌కు మరోసారి నిరాశే ఎదురవగా ఆస్ట్రేలియా సెమీస్‌కు అర్హత సాధించింది. మ్యాచ్‌లో పలుమార్లు పెనాల్టీ కార్నర్‌లు లభించినా వాటిని గోల్స్‌గా మలచడంలో రెండు జట్లూ విఫలమయ్యాయి. ఇదిలాఉండగా ఇప్పటికే సెమీస్ ఆశలు గల్లంతైన వేళ భారత పురుషుల జట్టు అర్జెంటీనాతో కీలక మ్యాచ్ ఆడనుంది. ఈ టోర్నీ సెమీస్ రేసులో నిలవాలంటే ఇతర సమీకరణాలకు తోడు హర్మన్‌ప్రీత్ సేన ఈ మ్యాచ్‌లో భారీ గోల్స్ తేడాతో విజయం సాధించాల్సి ఉంది.

# పంత్ భారీ సిక్సర్.. ముక్కలైన స్టేడియం పైకప్పు అద్దం!

**కొలంబో:** కొలంబో టెస్టులో రిషభ్ పంత్ తన మార్క్ విధ్వంసం చూపించాడు. మణికట్టు గాయం నొప్పిని భరిస్తూనే కీలక ఇన్నింగ్స్ ఆడిన పంత్ మెరుపు అర్ధ శతకంతో జట్టు భారీ స్కోర్‌లో భాగమయ్యాడు. తన తుఫాన్ ఇన్నింగ్స్‌తో శ్రీలంక బౌలర్లను హడలెత్తించిన ఈ చిచ్చరపిడుగు.. స్టేడియం పైకప్పు అద్దాన్ని సైతం పగలగొట్టాడు. శ్రీలంక పర్యటనలో భాగంగా కొలంబోలో జరుగుతున్న రెండో టెస్టులో భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ చెలరేగాడు. ఎడాపెడా బౌండరీలతో శ్రీలంక బౌలర్లను బెంబేలెత్తించిన పంత్ .. స్టేడియం పైకప్పు అద్దాన్ని ముక్కలు చేశాడు. రెండో రోజు తొలి సెషన్‌లోనే సరాన్ష్ జైన్ ఔటయ్యాక బ్యాటింగ్‌కు వచ్చిన ఈ పంత్.. 90వ ఓవర్లో భారీ సిక్సర్ బాదాడు. లహిరు కుమార సంధించిన బంతిని ఫైన్ లెగ్‌లో పంత్ బాదేయగా.. బంతి నేరుగా వెళ్లి స్టేడియం పైకప్పు మీదపడింది. 95 మీటర్ల ఆ సిక్సర్ ధాటికి అక్కడి సోలార్ రూఫ్ అద్దం పగిలిపోయింది. దాంతో.. లంక ఆటగాళ్లే కాదు కామెంటర్లు, ప్రేక్షకులు షాకయ్యారు. ఇక కామెంటేటర్ రస్సెల్ ఆర్నాల్డ్ అయితే పంత్ ధాటికి స్టేడియంలో ఏసీలు పనిచేయడం లేదు అని జోక్ చేశాడు.

## శతక భాగస్వామ్యం

తొలి సెషన్‌లో లంకబౌలర్లను ఉతికారేసిన పంత్ టెస్టుల్లో 21వ హాఫ్ సెంచరీ సాధించాడు. అంతేకాదు టెస్టుల్లో అత్యధిక పరుగుల చేసిన భారత వికెట్ కీపర్‌గా ఎంఎస్ ధోనీ రికార్డును బ్రేక్ చేశాడు. ధ్రువ్ జురెల్‌తో కలిసి అతడు శతక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఫలితంగా లంచ్ బ్రేక్ సమయానికి భారత్ 6 వికెట్ల నష్టానికి 419 రన్స్ చేసింది. అయితే.. భోజన విరామానికి 63 పరుగులతో ఉన్న పంత్ తర్వాత మొదటి బంతికే ఔటయ్యాడు.





# జైస్వాల్‌కు ఐసీసీ షాక్!

## లంక పేసర్‌తో వాగ్వాదం.. మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత

## అసిత ఫెర్నాండోకూ అదే శిక్ష

- ఇద్దరి ఖాతాలో ఒక్కో డీమెరిట్ పాయింట్
- తలలు దగ్గరకు రావడంతో జైస్వాల్ హెల్మెట్ తాకిన ఘటన
- తప్పు అంగీకరించడంతో విచారణ లేకుండానే శిక్ష ఖరారు

**కొలంబో:** శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో మైదానంలో సహనం కోల్పోయిన భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు అంతర్జాతీయ క్రికెట్ మండలి షాక్ ఇచ్చింది. శ్రీలంక పేసర్ అసిత ఫెర్నాండోతో వాగ్వాదానికి దిగిన ఘటనను తీవ్రంగా పరిగణించిన ఐసీసీ.. ఇద్దరికీ మ్యాచ్ ఫీజులో 25 శాతం చొప్పున జరిమానా విధించింది. అంతేకాకుండా ఇద్దరి క్రమశిక్షణ రికార్డుల్లో ఒక్కో డీమెరిట్ పాయింట్‌ను చేర్చింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 17వ ఓవర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. అసిత ఫెర్నాండో బౌలింగ్‌లో జైస్వాల్ ఔటయ్యాడు. శ్రీలంక ఆటగాళ్లు వికెట్‌ను సంబరంగా జరుపుకుంటుండగా జైస్వాల్ పెవిలియన్ వైపు వెళ్తున్న సమయంలో ఫెర్నాండో ఏవో వ్యాఖ్యలు చేయడంతో పరిస్థితి వేడెక్కింది. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి పరస్పరం ఎదురెదురుగా వచ్చారు. ఈ క్రమంలో ఫెర్నాండో తన తలను జైస్వాల్ వైపు తీసుకురాగా.. జైస్వాల్ కూడా ముందుకు వంగడంతో అతడి హెల్మెట్ ఫెర్నాండో నుదిటిని తాకింది. పరిస్థితి మరింత ముదరకముందే శ్రీలంక కెప్టెన్ ధనంజయ డిసిల్వాతో పాటు ఇతర ఆటగాళ్లు జోక్యం చేసుకుని ఇద్దరినీ విడదీశారు.

## ఇద్దరికీ ఒకే శిక్ష

ఈ ఘటనను ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.12 ఉల్లంఘనగా మ్యాచ్ అధికారులు పరిగణించారు. అంతర్జాతీయ మ్యాచ్ సందర్భంగా ఆటగాడు, అంపైర్, మ్యాచ్ రిఫరీ లేదా ఇతర వ్యక్తితో అనుచిత శారీరక స్పర్శకు దిగడాన్ని ఈ నిబంధన నిషేధిస్తుంది. మైదాన అంపైర్లు అహ్సాన్ రజా, షర్ఫుద్దౌలా ఇబ్నే షాహిద్, మూడో అంపైర్ రాడ్ టక్కర్, నాలుగో అంపైర్ ప్రగీత్ రాంబుక్వెల్లా అభియోగాలు మోపారు. జైస్వాల్, ఫెర్నాండో తమ తప్పును అంగీకరించడంతో మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ ప్రతిపాదించిన శిక్షను ఇద్దరూ అంగీకరించారు. దీంతో ప్రత్యేక విచారణ అవసరం లేకుండా పోయింది.

## మరోసారి తప్పితే చిక్కులే!

గత 24 నెలల్లో జైస్వాల్, ఫెర్నాండోకు ఎలాంటి క్రమశిక్షణ ఉల్లంఘనల రికార్డు లేకపోవడంతో దీన్ని తొలి తప్పిదంగా పరిగణించారు. లెవల్–1 ఉల్లంఘనకు అధికారిక హెచ్చరిక నుంచి మ్యాచ్ ఫీజులో గరిష్ఠంగా 50 శాతం వరకు జరిమానాతో పాటు ఒకటి లేదా రెండు డీమెరిట్ పాయింట్లు విధించే అవకాశం ఉంటుంది. ఐసీసీ నిబంధనల ప్రకారం 24 నెలల వ్యవధిలో నాలుగు లేదా అంతకంటే ఎక్కువ డీమెరిట్ పాయింట్లు చేరితే అవి సస్పెన్షన్ పాయింట్లుగా మారతాయి. దీంతో మ్యాచ్‌ల నిషేధం ఎదురయ్యే ప్రమాదమూ ఉంటుంది. తాజా ఘటనతో జైస్వాల్, ఫెర్నాండో ఖాతాల్లో ఒక్కో డీమెరిట్ పాయింట్ చేరింది.



# 140 ఏళ్లలో ఇదే తొలిసారి..

## ఓటమిలోనూ చరిత్ర సృష్టించిన షరీఫుల్!



- ఆస్ట్రేలియాపై బంగ్లా పేసర్ సంచలనం
- 15 ఓవర్లలో 48 పరుగులిచ్చి ఏడు వికెట్లు
- అయినా బంగ్లాదేశ్‌కు ఇన్నింగ్స్ ఓటమి
- రెండు టెస్టుల సిరీస్ 1-1తో సమం

**మాకే:** ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టెస్టులో బంగ్లాదేశ్ ఘోర పరాజయం పాలైనా.. ఆ జట్టు స్టార్ పేసర్ షరీఫుల్ ఇస్లాం మాత్రం చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. ఏకంగా 140 ఏళ్లుగా సాధ్యం కాని అరుదైన ఘనతను అందుకుని ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించాడు. ఆస్ట్రేలియాపై టెస్టు ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు పడగొట్టిన తొలి ఎడమచేతి పేసర్‌గా షరీఫుల్ అరుదైన రికార్డు నెలకొల్పాడు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో షరీఫుల్ నిప్పులు చెరిగాడు. 15 ఓవర్లు బౌలింగ్ చేసి కేవలం 48 పరుగులిచ్చి ఏడు వికెట్లు పడగొట్టాడు. అతడి ధాటికి ఆసీస్ బ్యాటింగ్ విభాగం తడబడింది. చివరకు ఆస్ట్రేలియా 210 పరుగులకు ఆలౌటైంది.దఆస్ట్రేలియాతో టెస్టులో ఎడమచేతి పేసర్ ఒక ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు పడగొట్టడం 140 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. 1886లో ఇంగ్లండ్‌కు చెందిన డిక్ బార్లో మాంచెస్టర్ టెస్టులో 44 పరుగులిచ్చి ఏడు వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత ఇన్నేళ్లకు షరీఫుల్ ఆ ఘనతను అందుకున్నాడు. ఆస్ట్రేలియాపై టెస్టు ఇన్నింగ్స్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన రికార్డు మాత్రం ఇంగ్లండ్ దిగ్గజ స్పిన్నర్ జిమ్ లేకర్ పేరిట ఉంది. 1956 మాంచెస్టర్ టెస్టులో ఆయన 53 పరుగులిచ్చి మొత్తం పది వికెట్లను నేలకూల్చి చరిత్ర సృష్టించాడు.

## షరీఫుల్ మెరిసినా.. బంగ్లా కుప్పకూలింది

బౌలింగ్‌లో షరీఫుల్ అద్భుతం చేసినా బంగ్లాదేశ్ బ్యాటర్లు మాత్రం పూర్తిగా చేతులెత్తేశారు. తొలి ఇన్నింగ్స్‌లో 34 ఓవర్లలో 64 పరుగులకే ఆలౌటైన బంగ్లా.. రెండో ఇన్నింగ్స్‌లోనూ 38.3 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలింది. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి పది వికెట్లు పడగొట్టి బంగ్లా పతనాన్ని శాసించాడు. ఫలితంగా ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 51 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలి టెస్టులో బంగ్లాదేశ్ సంచలన విజయం సాధించగా.. రెండో టెస్టును ఆసీస్ గెలుచుకోవడంతో రెండు మ్యాచ్‌ల సిరీస్ 1–1తో సవ–ంమైంది.

## ర్యాంకింగ్స్‌లోనూ బంగ్లా కొత్త చరిత్ర

సిరీస్ అనంతరం బంగ్లాదేశ్‌కు మరో అరుదైన ఘనత దక్కింది. తాజా టెస్టు ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి ఆరో స్థానానికి చేరుకుంది. 78 రేటింగ్ పాయింట్లతో వెస్టిండీస్, పాకిస్థాన్, శ్రీలంకలను వెనక్కి నెట్టి ఆరో స్థానంలో నిలిచింది. టెస్టు ర్యాంకింగ్స్‌లో బంగ్లాదేశ్ తొమ్మిదో స్థానం కంటే పైకి రావడం ఇదే తొలిసారి.




# మహాకాళిలో శుక్రాచార్యుడి పాత్ర పరిచయం

బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా శుక్రాచార్యుడిగా కనిపించనున్న చిత్రం 'మహాకాళి' సినిమాకు పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో శుక్రాచార్యుడి పాత్రను పరిచయం చేస్తూ 'శుక్రాచార్య వార్ క్రై' అనే క్యాప్షన్‌తో ఓ పవర్‌ఫుల్ వీడియోను పంచుకున్నారు. ఇందులో శ్రియా రెడ్డి మహాకాళిగా నటించారు. వచ్చే ఏడాది జనవరి 8న ఈ సినిమా విడుదల కానున్నట్లు టీమ్ తెలిపింది. 'హను మాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అదే 'మహాకాళి'. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, క్యారెక్టర్ లుక్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచగా.. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆ హైప్‌ను మరింత పదింతలు చేసింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఫీమేల్ సూపర్ హీరో మైథలాజికల్ ఎపిక్‌గా 'మహాకాళి' రూపొందుతోంది. 'మహాకాళి' గ్లింప్స్‌తో గూస్‌బంప్స్.. శుక్రాచార్యుడి వార్ క్రైతో పాన్ ఇండియా సంచలనం! 'హను మాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అదే 'మహాకాళి'. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, క్యారెక్టర్ లుక్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచగా.. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆ హైప్‌ను మరింత పదింతలు చేసింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఫీమేల్ సూపర్ హీరో మైథలాజికల్ ఎపిక్‌గా 'మహాకాళి' రూపొందుతోంది. తాజాగా 'శుక్రాచార్య వార్ క్రై' పేరుతో విడుదల చేసిన వీడియో ఆద్యంతం గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. ఓ అమ్మవారి ఆలయంలో పసిబిడ్డను వదిలివేయడంతో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి కథ రాక్షసుల రాజగురువైన శుక్రాచార్యుడు చేసే భీకర తపస్సు, ఆయన ప్రతీకార సంకల్పం వైపు సాగుతుంది.క్షీరసాగర మథనం సమయంలో రాక్షసులకు అమృతం దక్కకుండా చేసి, రాక్షస జాతి వినాశనానికి కారణమైన శ్రీ మహావిష్ణువుపై శుక్రాచార్యుడు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు గ్లింప్స్‌లో చూపించారు. శుక్రాచార్యుడి పాత్రలో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా పవర్‌ఫుల్‌గా కనిపించారు. కేవలం 14 రోజుల్లో అసుర విజయ ఘోష సమస్త బ్రహ్మాండంలో ప్రతిధ్వనించేలా చేస్తానంటూ ఆయన చేసే ప్రతిజ్ఞ కథపై మరింత ఆసక్తిని పెంచుతోంది. అసలు ఆ 14 రోజుల ప్లాన్ ఏమిటి? రాక్షసుల విజయానికి శుక్రాచార్యుడు ఎలాంటి శక్తులను ఉపయోగించబోతున్నాడు? అతని భీకర సంకల్పాన్ని అడ్డుకోవడానికి మహాకాళి ఎలా అవతరిస్తుంది? అనే ప్రశ్నలను గ్లింప్స్ ప్రేక్షకుల ముందుంచింది. గ్లింప్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది మహాకాళి రౌద్ర రూపం. నల్లని వర్ణం, ముక్కుపుడక, ఉగ్ర స్వరూపంతో అమ్మవారిని అత్యంత శక్తిమంతంగా చూపించారు.

# వారణాసిపై మరో సంచలన వార్త

## వివిధ భాషల కోసం 1600 మంది డబ్బింగ్ ఆర్టిస్టులు




దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ అడ్వెంచర్ మూవీ 'వారణాసి' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దాదాపు రూ. 1,400 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది. 'వారణాసి'ని ప్రపంచవ్యాప్తంగా 120కి పైగా దేశాల్లో, 50కి పైగా అంతర్జాతీయ, ప్రాంతీయ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఇంత భారీ స్థాయిలో సినిమాను వివిధ భాషల్లోకి తీసుకెళ్లే విషయంలో రాజమౌళి ప్రత్యేకమైన విధానాన్ని ఎంచుకున్నారట. ప్రస్తుతం సినిమాల డబ్బింగ్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాయిస్ క్లోనింగ్ వంటి టెక్నాలజీలను ఉపయోగించడం పెరుగుతోంది. అయితే 'వారణాసి' విషయంలో మాత్రం రాజమౌళి ఈ విధానానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. నటీనటుల గొంతులోని సహజత్వం, భావోద్వేగాలు, డైలాగ్ డెలివరీలోని తీవ్రత ప్రతి భాషలోనూ ప్రేక్షకులకు సరిగ్గా చేరాలంటే స్థానిక ప్రొఫెషనల్ డబ్బింగ్ ఆర్టిస్టులే కీలకమని రాజమౌళి భావిస్తున్నారట. అందుకే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1600 మందికి పైగా డబ్బింగ్ ఆర్టిస్టులను రంగంలోకి దించుతున్నట్లు సమాచారం. ఆయా భాషలకు సంబంధించిన ఉచ్చారణ, స్థానిక యాస, సంస్కృతికి అనుగుణంగా డైలాగ్స్‌ను రికార్డ్ చేయనున్నారని తెలుస్తోంది. మహేష్ బాబు, ప్రియాంక చోప్రా వంటి ప్రధాన నటుల నటనలోని ఎమోషన్ ఏ భాషలో చూసినా ప్రేక్షకులకు సహజంగా అనిపించేలా ఈ డబ్బింగ్ ప్రక్రియను డిజైన్ చేస్తున్నారట. 50కి పైగా భాషల్లో ఇంత భారీ సంఖ్యలో డబ్బింగ్ ఆర్టిస్టులతో పనిచేయడం భారతీయ సినిమా స్థాయిలో అరుదైన ప్రయత్నంగా మారనుంది. వారణాసి కథాంశం కూడా అత్యంత ఆసక్తికరంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. భూమిని ఢీకొట్టేందుకు దూసుకొస్తున్న ఓ భారీ ఉల్క వల్ల ఏర్పడే ప్రమాదం నుంచి వారణాసితో పాటు ప్రపంచాన్ని రక్షించే సాహసోపేతమైన కథతో ఈ సినిమా సాగుతుందని సమాచారం. మహేష్ బాబు ఇందులో 'రుద్ర' అనే పాత్రలో కనిపించనుండగా.. కథలో భాగంగా వివిధ కాలాల మధ్య ప్రయాణించే సాహసికుడిగా ఆయన పాత్ర ఉండబోతుందని టాక్. భారతీయ పురాణాలు, సనాతన సంస్కృతి అంశాలను ఆధునిక గ్లోబల్ అడ్వెంచర్ కథతో కలిపి రాజమౌళి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. 'వారణాసి' షూటింగ్ ఇప్పటికే హైదరాబాద్, ఒడిశా, ఆఫ్రికాలోని కెన్యా తదితర ప్రాంతాల్లో జరిగింది. అంతేకాదు.. అంటార్కిటికాలో షూటింగ్ జరుపుకున్న తొలి భారతీయ చిత్రంగా ఈ సినిమా ప్రత్యేక గుర్తింపు దక్కించుకుంది.



# రాకాలో ఐశ్వర్యలక్ష్మి

## నెగెటివ్ షేడ్ అంటూ ప్రచారం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'రాకా' పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. భారీ బడ్జెట్‌తో, అంతర్జాతీయ స్థాయి టెక్నీషియన్స్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా ఈ సినిమాలో నటి ఐశ్వర్య లక్ష్మి కూడా కీలక పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాకా'లో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా కాకుండా విభిన్నమైన, ప్రాధాన్యత ఉన్న పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది.




ముఖ్యంగా ఆమె పాత్రలో నెగిటివ్ షేడ్స్ ఉంటాయని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అయితే ఆమె పాత్ర ఎలా ఉంటుంది? అల్లు అర్జున్ పాత్రతో ఆమెకు ఉన్న సంబంధం ఏమిటి? అనే విషయాలపై చిత్రబృందం ఇంకా ఎలాంటి అధికారిక వివరాలు వెల్లడించలేదు. ప్రస్తుతం ముంబైలో ఈ చిత్ర షూటింగ్ జరుగుతుండగా, త్వరలోనే ఐశ్వర్య లక్ష్మి కూడా షూటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. ఆమె పాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో బయటకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ భారీ ప్రాజెక్టులో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఆమెతో పాటు టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్, యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ కూడా సినిమాలో కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇలా ఒకే సినిమాలో పలువురు ప్రముఖ హీరోయిన్లు భాగం కావడం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. అయితే ఈ నటీనటుల పాత్రలపై చిత్రబృందం నుంచి పూర్తి స్థాయి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'రాకా' కథ మాఫియా నేపథ్యంలో సాగుతుందని ప్రచారం జరుగుతోంది. ఓ పవర్‌ఫుల్ డాన్ చుట్టూ తిరిగే ఈ కథలో అల్లు అర్జున్ అత్యంత స్టైలిష్, మాస్ అవతార్‌లో కనిపించనున్నారని టాక్. ముఖ్యంగా అట్లీ సినిమాల ప్రత్యేకతగా నిలిచే భారీ యాక్షన్ ఎపిసోడ్స్ ఈ చిత్రంలో ప్రధాన ఆకర్షణగా ఉంటాయని తెలుస్తోంది.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com